

# ఆశయాలూ అనుబంధాలూ

నిదాఘం. విశాఖ. బయట ఖరకిరణుడు నిప్పులు కురుస్తున్నాడు. ద్వారకానగర్‌లో అన్ని సదుపాయాలూ అమరిన ఆ చిన్న ఇంటిలో అప్పుడే కాంపునుంచి వచ్చి భోజనం చేసి పడుకున్నాడు రఘురామయ్య.

భోజనం దగ్గర భానుమతి పెళ్ళి ప్రస్తావన తెచ్చేడు. ఎర్నింట్లంలో ఓ కుర్రాడు ఉన్నాడు. చదువే ఆస్తి. గుణం జాస్తీట!

భానుమతికి తన పెళ్ళిగురించి అంత్రడి

**స్వార్థపూరితమైన ప్రపంచంలో నిస్స్వార్థం బలహీనతగా పరిగణిత మౌతుంది. నిర్లిప్తత నిస్సహాయతగా చలామణి అవుతుంది. అందునా ఆశయం అంటూ ఉండడం, దానికోసం తపించడం కేవలం వెర్రితనంగా భాసిస్తుంది. అయినా ఆశ్చర్యం! ఈ లక్షణాలు అన్నీ మూర్తీభవించిన పురుషుని ప్రేమించని స్త్రీ మాత్రం కానరాదు!**

---

మాట్లాడినప్పుడల్లా వచ్చిందేచిక్కు. ఒక్క పెళ్ళే కాదు, ఆడపిల్ల స్వయంగా తండ్రితో చెప్పుకో లేనివి ఎన్నో ఉంటాయి.

ఆడపిల్లలకు తల్లి ఓడకు హార్బరు లాంటిది. సురక్షితంగా ఉంచడమేకాదు, ఆమెనుండి ఏమి పైకి తియ్యాలన్నా, ఆమెలో ఏమి నింపాలన్నా తల్లికే శక్యం అవుతుంది. తండ్రికో? తను నోరు విప్పి చెప్పుకుంటేనే. మొన్న మొన్నటిదాకా మేనత్తయినా ఉండేది తమతోపాటు. ఇప్పుడీ ఇంట్లో తను ఒంటరిది.

ఎంగిళ్ళు ఎత్తి, కంచాలు కడిగి నడవలోకి వచ్చింది భాను. ఆవరణలో ఎవరో పిరికిగా దగ్గినట్లయింది. ఎవరో అని ఊరుకుంది. పిలుపు వినరాలేదు. తనే గుమ్మందగ్గరికి వెళ్ళింది.

ఆవరణలో రకరకాల పూల మొక్కలున్నాయి. బండిగూడులా బద్దలతో కట్టిన పందిరిపైకి దట్టంగా పాకిన తీగలు చల్లదనాన్ని వర్షిస్తున్నాయి. మెట్లమీద క్రోటన్సు.

ఒక యువకుడు వచ్చిన పని వదిలి మొక్కలను పరిశీలిస్తూ కూర్చున్నాడు. పాపం తల్లో, తండ్రో పోయేరు కాబోలు, చిన్న పిలక తప్పిస్తే బుర్రఅంతా నున్నగా ఉంది.

"ఎవరు కావాలి?" అంది భానుమతి.

'ఏమిటలా చూస్తున్నారు?' అన్నట్లు విన పడిందో ఏమో, ఆ కుర్రాడు ఇటు తిరిగి, "ఎంత చక్కని చిన్న పువ్వులండీ! చైనీస్ ఆర్టిస్టులు ఇలాటి చిన్నపువ్వులనూ. వాటి మీది పలచటి నీడ లనూ ఎంత చక్కగా చిత్రించగలరు!" అన్నాడు.

"ఇప్పుడు మాకు బొమ్మలక్కర్లేదు" అనే సింది భాను మామూలుగా. కాని అతని కంగారు చూసి నవ్వుకుంది.

"అబ్బే. నేను చిత్రాల ఏజెంటుని కానండీ. అంటే......" అని తడుముకోసాగేడు (మన్నని బుర్ర) మాటలకోసం.

"చైనా పంచవర్షాంగదశానికి చెందిన—"

"హతోస్మి!" నిరాయుధుడుగాచేసినప్పటిలాగ ముఖం వేలాడవేసేడు.

వదులుగా, పొడుగుగా ఉన్న, అతనిది కావి చొక్కా చూసి గడిచిన ధనుర్మాసంలో గుళ్ళో గీతోపన్యాసమిచ్చిన స్వాములారి అంగీలా ఉందని పించింది భానుమతికి.

అతన్ని ఏడిపించాలని బుద్ధి పుట్టింది.

"మరి—? ఆర్టోపన్యాసకులా?" అంది.

వాడి ఉన్న అతని ముఖం విడింది. అంద మైన ఆడపిల్ల ఏడిపించడానికన్న మాటలుకూడా పన్నీటిజల్లులే. "ఆర్టోపన్యాసకులా అనిఅడగండి. గుణంకాదు. సవర్ణదీర్ఘం చెయ్యాలి."

అతని చేతిలోని కవరు చూసి అతనెందుకు వచ్చిందీ గ్రహించేసింది భాను.

"ఓహో! గుణం, అంటే మెరిట్ కాదు ముఖ్యం; సవర్ణదీర్ఘం, అంటే తనకులం వాళ్ళని ముందుకు తీసుకురావడం చెయ్యాలి అధికారులు అనా మీ అభిప్రాయం?" అని, తెల్లబోయి చూస్తున్న కుర్రాణ్ణి అలాగే వదిలేసి నవ్వు కుంటూ లోపలికి వచ్చింది.

నిద్రలేదు, రఘురామయ్యకు.

నవ్వంతా తుడిచేసుకున్నాక తండ్రి ఎదుట పడింది. ఏమీ ఎరగనట్లు "ఎవరో వచ్చినట్లు న్నారు నాన్నా, మీకోసం" అంది.

రఘురామయ్య బద్ధకంగా లేచి వరండాలోకి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. స్వతహాగా జాలి గుండె ఆయనది. కుర్రవాడి వాలకం చూసి కరిగి పోయేడు. ఆకుర్రవాడేమికోరినాఇచ్చెయ్యాలన్నంత దయ కలిగిందాయనలో.

పుష్పానందుడాయనకు నమస్కరించి దగ్గరికి వచ్చి కవరిచ్చేడు.

"సెకండరీగ్రేడు ట్రెయినింగుకు ....... సీటుకి......" మాటలు మింగుతున్నాడు.

"సరే. ఇయ్యి" అన్నాడు రఘురామయ్య.

తన కేమీ పట్టనట్టు అన్నట్టు భయపడ్డాడేమో "మీరు.......దీన్ని......ప్రత్యేకంగా పరిశీలించాలి" అని వేడుకోసాగేడు.

"అలాగే. లేవోయ్."

'చచ్చేను! ఇది సీటు వచ్చే సూచనకాదు' అని తోచింది కామోసు, "అయ్యా, నేను మెరిట్ లేనివాణ్ణి కాదు. ట్రూ కాపీలు చిత్తగిస్తే తమకే విశదం అవుతుంది" అని ప్రాధేయపడసాగేడు.

"అలాగేనంటే వినవేంయ్యా? ఈ ఈడులో ఇంత చాదస్తం ఏమిటి నీకు?" అన్నాడు రఘురామయ్య.

"ప—రి—స్థి—తు—లు!"

అది మాట కాదు; గొప్ప మూలుగు, అతని దైన్యాన్ని చూసి, 'ఇందాకటి యువకుడేనా, ఈ ముసలి మనిషి!' అని ఆశ్చర్యపోయింది భానుమతి.

కాగితాలు తీసి చూస్తూ అట్టే తల ఎత్తి చూసేడు రఘురామయ్య.

"అబ్బ! ఏమిటోయి, ఈ మార్కులు? యూనివర్సిటీ ఫస్టువా, రికార్డు బ్రేకర్వా? ఇన్ని మార్కులొచ్చి ఈ ట్రెయినింగు కెందుకోయి? వెళ్ళవోయి, వెళ్ళు. ఇంజనీరింగు చదువు. ఇవాళ పేపర్లో నెహ్రూగా రేమంటున్నారో చూసేవా?......" ఏదో వెర్రి ఆనందంవల్ల ఉత్సాహంగా అనేస్తున్నాడాయన.

భానుకు మతిపోయింది.

"అవకాశాల్లేవు."

మీటనొక్కినంత విశ్చయంగా చెప్పిన ఆ ఒక్క ముక్కతో రఘురామయ్యగారు కళ్ళెంపట్టి

## రుద్రాభట్ల నరసింగరావు

నట్టు ఆగిపోయి మరోసారి దరఖాస్తు చూసేడు. చూపు ఆ కుర్రాడి ఇంటిపేరు మీదకు వెళ్ళగానే హృదయం ఓ గెంతూ, తండ్రిపేరు మీదకు వెళ్ళగానే మరోగెంతూ వెయ్యగా గభీమని లేచి నించున్నాడు రఘురామయ్య.

"ఆఁ! భగవాన్లుకొడుకువా నువ్వు? చెప్పేవు కాదేవోఁయి?"

"క్షమించండి. తెలీదు."

"ఏవిఁటీ?!" అని కళ్ళజోడు తీసి ఆశ్చర్యంగా "నువ్వు భగవాన్లు కొడుకువని నీకే తెలీదా?" అన్నాడు రఘురామయ్య.

'ఏవిఁటి, నాన్నా, అది?' అని తండ్రిని మందలించబోయి తమాయించుకుంది భాను. ప్రాణ స్నేహితుడి కొడుకును చూసిన ఆనందంతో తండ్రి తొట్రుపడుతున్నాడు.

భానుమతికి తన తండ్రి గురించి ఎంత తెలుసో భగవాన్లు గురించీ అంత తెలుసు. ఆయనను ఎన్నడూ కంటితో చూసి ఎరగదు మళ్ళీ. భగవాన్లు గురించి ఇంట్లో రఘురామయ్య అనుకోని రోజా ఉండదు.

"అది కాదు. మీరు మా నాన్నగారిని ఎరుగుదురని నాకు తెలీదు."

"అవునవును. నీకెలా తెలుస్తుంది? నువ్వప్పుడు ఇంత గుంటడివి. నేను మీ నాన్నని చూసి పద్దెనిమిదేళ్ళయింది.కాని అతను ఇక్కడే ఉన్నాడు" అని గుండెలమీద కొట్టుకుంటూ చెప్పేడు రఘురామయ్య.

తండ్రి ఆవేశానికి కొంచెం సిగ్గు పడింది భాను. "నాన్నా, ఆయన్ని లోపలికి తీసుకొచ్చి కూర్చోబెట్టు" అని తను వంటింట్లోకి దారి తీసింది.

ఎన్నో ఊహలతో ఆమె ఉక్కిరి బిక్కిరి అవుతున్నది. ఎలా కలిపిందో ఆ కాఫీలు?

గదిలో అడుగు పెట్టేటప్పటికి గాలిలో గొప్ప విషాదం అలుముకుని ఉన్నట్టు తోచింది భానుమతికి. అక్కడి నిశ్శబ్దాన్ని భంగపరచడానికి భయపడుతున్నట్టు అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చి వారి మధ్య బల్లమీద కాఫీలు ఉంచింది.

తండ్రి నిట్టూర్చి అన్నాడు: "ఇది వెలంపిల్లగా ఉన్నప్పుడు— నాకు బాగా జ్ఞాపకం. నలభై నాలుగులో— విజయనగరం స్టేషనుకొచ్చి పలకరించేడు. 'బళ్ళారి బదిలీయా? పాపం, ఉద్యోగస్థుడివిగదా మరి!' అంటూ మల్లిపువ్వులా నవ్వేడు, ఉన్నప్పుడూ లేనప్పుడూ కూడా డబ్బుని తృణంగా చూడగలిగే భగవాన్లు" అని, తలవంచుకుని మళ్ళీ "అదే కడసారి చూడవు

తుందనుకోలేదు" అన్నాడు.

పిడుగు పడినట్లయింది భానుమతికి. తండ్రి దుఃఖం చూడలేక వంటింట్లోకి పరిగెట్టింది. అక్కడ తోచక పెరట్లోకి పోయి నీళ్ళకుండీ పైన కూర్చుని చేమంతిని కోసి ఊరికే రేకులు చిదిపేస్తూ కూర్చుంది. చాలా సేపటికి తండ్రి వచ్చేడు.

"ఇక్కడేం చేస్తున్నావమ్మలూ? నీకోసం ఇల్లంతా వెతికేను."

తండ్రిని చూసి నిలబడితే కళ్ళు నిండేయి.

"పిచ్చిపిల్లా! ఊరుకో" అని ఓదార్చి కలవరి పడుతున్నట్టు అన్నాడు రఘురామయ్య: "ఈ ప్రాంతాలకి తిరిగొచ్చేము కదా, ఎప్పుడో ఒకసారి భగవాన్లుని కలుసుకుని నిన్ను గర్వంగా చూపించి 'ఇదుగోనోయి నా రత్నం. మీ యింటి కోడలుగా చేసుకో' అందామనుకున్నాను. నా కలాటి అదృష్టం ఉంటే ఆనాడు మీ అమ్మ నన్ను దగా చెయ్యకుండా ఉండేది."

తనను ఓదార్చ వచ్చిన తండ్రే పసిపిల్లవాడై పోగా భాను ధైర్యం చెప్పవలసి వచ్చింది అతనికి. సంభాషణ మార్చటం కోసం అడిగినట్టు "ఆయన వెళ్ళిపోయేరా, నాన్నా?" అంది భాను.

"ఆఁ. వెళ్ళిపోయేడమ్మా. అప్లికేషను పోస్టులో పంపించే వ్యవధిలేక స్వయంగా పట్టుకొచ్చేట్ట. ఈ మూలకంగానయినా కలుసుకున్నాము. అంతా ఘటన. ఒక్క పూటయినా మనింట్లో ఉండి వెళ్ళమని బతిమాలేను. తల్లి జొంగతో కనిపెట్టుకుని ఉంటుందంటే చేసేది లేక పోనిచ్చేను" అన్నాడు తండ్రి తల్లి ముందు నేరం చేసిన పిల్లవాడులాగ.

తలవంచుకుని నిట్టూర్పును అణుచుకుని ఇంట్లోకి నడిచింది భానుమతి.

## 2

ప్రొబేషనులో చేరవలసిన రోజు దాటినా, కామేశ్వరరావు మళ్ళీ రాలేదు తమ ఇంటికి. తండ్రీ, తనూ అవమానింపబడినట్టు బాధపడింది భానుమతి. ఆ మాటను వస్తే ఆ అవమానం తనదిమాత్రమే కాదు; స్నేహానిదీ, అందానిదీ కూడా!

"అసలలాటివాళ్ళకి సిఫార్సే చెయ్యకూడదు, నాన్నా, ఎవ్వడిగితే" అంది ఓనాడు కామేశ్వరరావును చూడాలని తహతహలాడుతున్న తండ్రితో. ఆశ్చర్యపోయేడు రఘురామయ్య ఆమె కోప కారణం అర్థంకాక.

"అసలాయన చేరేడో లేదో, నాన్నా?"

"చేరే ఉంటాడు. అమ్మ ఆ తండ్రే. ఈ సీట్లూ, ఉద్యోగాలూ వచ్చినందుకు పెద్ద సంతోషించడు" అన్నాడు కాఫీ అందుకుంటూ.

"సంతోషించకపోతే మానీమను. కృతజ్ఞత చెప్పుకునేపాటి మర్యాద లేనివాడైతే ఎలా?" అని గిరుక్కున తిరిగిపోయింది, తండ్రి పంచదార కావాలంటున్నా వినిపించుకోనట్టు.

# ఆశయాలూ అనుబంధాలూ

ఆమె వెళ్ళినవైపే చూస్తూ ఉండిపోయేడు రఘురామయ్య. అప్పటికి కూతురి కోపం కొంచెం అర్థమయినట్టు అనిపించింది ఆయనకు.

ఆయన ముఖం వింతసంతోషంతో విప్పారింది. కాఫీ కొంత బట్టలమీద చిందించుకుంటూ గడగడ తాగేసేడు.

"అదేం, నాన్నా? పంచదార తెస్తున్నాను గదా?" అంది భాను చెమ్చాతోవచ్చి నిలబడి.

"వద్దమ్మలూ. తియ్యగా ఉంది. తీపిగొడ్డు."

నవ్వింది భాను పువ్వులా. "పుల్లగొడ్డు ఉంటుందిగాని, తీపిగొడ్డు ఉండదు, నాన్నా."

ఆయన బట్టలు వేసుకుని వెళ్ళిపోగానే 'రేపొద్దున్న నాకు పెళ్ళయి అత్తారింటికి వెళ్ళిపోతే నాన్నను చూసేదెవరు?' అనే తలపువచ్చి జాలిగా చూస్తూ కూర్చుండిపోయింది.

ఆ సాయంకాలం—

గుమ్మం దగ్గర ఆ పిలిచినట్లు వినిపించింది.

చురుకుగా పైకి వెళ్ళింది అతని రాకను భావిస్తున్నట్టు భాను.

### సంక్రాంతి లక్ష్మి

**పుట్టమరాజు**

నవ్యజీవన రాగ మధువును
దివ్యచషకమునందు నిడుకొని
సంతసము కలిగింప వచ్చితివా
సకలధాత్రికి, సంకురాత్రీ!

శత సహస్ర రవిద్యుతిరంజిత
శరజ్జ్యోత్స్నల వెల్లువల వలె
అందమును ఆరవిందము కరణి
అరుగుదెంచితివమ్మ, లక్ష్మీ!

ముచ్చటగు ముత్యాల ముగ్గుల
ముద్దుగొలిపెడు గొబ్బి చెలువలు
ముంగిళుల నవకాంతులీనుచు
మంగళాహ్వానములు పలికిరి!

త్వదీయాగతి నిఖిల జగతియు
నవ్వెలను వెలుగొందు నిత్యము!
శుభము, సౌభాగ్యమ్ము, శాంతియు,
సుఖములే మా కనుమ సత్యము!

"నాన్నగారున్నారా?" నీలం జైండు, లోపల గులాబీరంగు కాగితాలా ఉన్న పుస్తకాన్ని మూలలు పట్టుకు తిప్పుతూ అడిగేడు కామేశ్వరరావు.

"ఆఫీసుకెళ్ళేరు. వచ్చే టైమయింది. ఇలా లోపలికి వచ్చి కూర్చోండి" అని తాను ముందు దారి తీసింది.

పిల్లిలా అనుసరించేడు కామేశ్వరరావు. గదిలో కూర్చున్నాడు.

పెరట్లోకి వెళ్ళి ముఖం కడుక్కుని బొట్టూ కాటికా పెట్టుకుని తయారయింది భానుమతి.

తండ్రివచ్చే వేళయింది కనక, అతిథికి ప్రత్యేకంగా కాఫీపెట్టే ప్రయత్నం మానుకుంది. నెమ్మదిగా గదిలోకి వచ్చి అతనికెదురుగా ఉన్న ఓ కుర్చీని ఆనుకుని నిలబడింది.

కామేశ్వరరావు కళ్ళు మూసుకుని వాలి ఉన్నాడు కుర్చీలో.

'మాటల్లోనే కాదు; అలవాట్లలోనూ ఒట్టి మునలివాడులా కనిపిస్తున్నాడు ఈ కుర్రాడు.' నవ్వు వచ్చింది భానుకు.

"నిద్రపోతున్నారా?"

కామేశ్వరరావు కళ్ళు విప్పి నిటారుగా కూర్చున్నాడు. "ఆ. నిద్రపోవడమా? ఎంతమాట న్నారు?" అన్నాడు.

చిన్నబోయింది భాను ముఖం, తనేమైనా తప్పుగా మాట్లాడిందేమోననే అనుమానంతో.

అది కనిపెట్టి కంగారుపడ్డాడు కామేశ్వరరావు. "అబ్బెబ్బే. నా ఉద్దేశం అది కాదు. నిద్ర నాకు కరువైనదీ, అరుదైనదీను. ఏ అర్ధరాత్రి దాటాకో నూర్జాహాలు వేసేవేళ చిరు నవ్వులు చిప్పిలు చేసుకుంటూ దేవలోకం నుంచి నా రెప్పలపైకి జారుతుంది నిద్ర, జ్యోత్స్నాభిసారికలా— అన్నట్టు మీకు కొంత సాహిత్యం ఉందనుకుంటాను."

తనెక్కడ నొచ్చుకున్నదో అని బాధపడిపోతున్నాడని భాను గ్రహించింది.

"ఉంది. మా నాన్నగారి బీరువాలో" అని నవ్వింది.

"మంచిది. దాన్ని అక్కడే ఉండనివ్వండి. సాహిత్యం మనకి కొత్తలోకాల్ని తెరుస్తుంది. కాని సంఘం వాటిలోకి అడుగుపెట్టనివ్వదు. సాహితీపరుడికి సంఘంతో, లేక జీవితంతోనే సర్దుబాటు కష్టం అవుతుంది."

కామేశ్వరరావు లోతులకు చూస్తున్నట్టు చూస్తూ ఉండిపోయింది భానుమతి.

ఆ చూపుముందు కెమేరాముందు నిలబడే కోయపడుచులా ఇబ్బందిగా కదిలేడు కామేశ్వరరావు.

"ఎంతసేపయిందోయి వచ్చి" అంటూ ప్రవేశించేడు రఘురామయ్య.

"ఇప్పుడేనండి." భాను సమక్షంలో కాలజ్ఞానంలేని కామేశ్వరరావు చెప్పేడు.

భాను తప్పుకుని లోపలికి వెళ్ళింది.

కాఫీలతో తిరిగి గదిలో అడుగుపెట్టేటప్పటికి కామేశ్వరరావు ఉపన్యాసం మంచి పట్టులో ఉంది: "....ఎదుట ఏదో రూపాన్ని ఆశించి, ఆర్థికంగా ఆలోచించి, స్వేచ్ఛని ప్రేమించి ఇంచి ఇంచి చొప్పున పెళ్ళివైపు జరుగుతూ పిలియనంతకాలం దాన్ని వాయిదా వేస్తున్నారు నేటి యువకులు."

నవ్వును అణచుకుంటూ కాఫీలు తెచ్చి పెట్టింది భాను.

"పెళ్ళిచేసుకోవా అనడిగితే ఎంత ఉపన్యాసం దంచిసేవోయి? నీ ఇల్లు బంగారంగానూ!"

"వద్దొద్దు. ఇంకా మీకు ముచ్చటగా ఉంటే 'నీ ఇల్లు బంగారం బొందు గానూ' అనండి."

"బావుంది, బావుంది" అంటూ నవ్వులో దొర్లిపోసాగేడు రఘురామయ్య.

"ఏమిటి, నాన్నా, మీరూ ఆయనతో సమానంగా? కాఫీలు తీసుకోరా ఏమిటి?" అంది భాను.

అంతలోనే పిస్సు పడింది.

లోపలికి వెళ్ళింది. వంట మొదలు పెట్టింది. వంట ఒక కళ అయితే ఆ కళకు ఇన్‌స్పిరేషన్ ఇచ్చే సందర్భాలిలాటివే. మిగతా రోజుల్లో అది ఒక క్రాప్టు మాత్రమే.

చాలా సేపటికి తండ్రి వచ్చేడు, "వెళ్ళి పోయేడే, అమ్మలూ, అతను" అంటూ.

"అదేమిటి, నాన్నా? భోజనానికి ఉండమంటానుకున్నానే!" అంది తన ఆశాభంగాన్ని పిలియనంత కప్పిపుచ్చుకుంటూ.

"పులి కడుపున పిల్లిపిల్ల పుడుతుందా, అమ్మలూ? ఆ తండ్రిలాగే అతనికీ చెడ్డ అభిమానపూ, మొహమాటపూను. ఏకంగా మనింట్లో వచ్చి ఉండిపొమ్మన్నాను. ఊహుఁ. ఇంకెవడితోనో కలిసి వంట పెట్టేడుట. ఈ గడ్డు ఊళ్ళో ఎలా బతుకుతాడో, ఏమిటో నా కర్థం కాదు" అని దీర్ఘంగా నిట్టూర్చి వెళ్ళిపోయేడు రఘురామయ్య.

తండ్రి కామేశ్వరరావుకోసం చాలా బాధ పడుతున్నట్టు గ్రహించింది భాను.

తనకూ బాధగానే ఉంది.

పసరు పొంగి పొయ్యిలో పడింది. మంట ఆరింది.

వంకాయ పెరుగు పచ్చడి, పొట్లకాయ వేపుడు, టొమేటో చారు తనవంక జాలిగా చూసేయి. కత్తిపీట పక్కనున్న కేబేజీ పువ్వుకు పథ వాయిదా పడింది.

మర్నాడు పొద్దున్న అమ్మగారి పెట్టె చూసి ఆశ్చర్యపడి, "ఏటమ్మగారూ ఇసేపం? పెళ్ళోరి పెట్టెలాగుంది" అంది పని మనిషి.

"నోరు మూసుకుందూ. చుట్టం వస్తారని వండేను. రాలేదు."

"ఇంతకీ మవ్వు తిన్నావా, తల్లీ? ఇద్దరి బువ్వ మిగిలిపోనాది."

పిరసంగా నవ్వింది భాను. పని మనుషుల కక్కుర్తేని ఆరాలు ఉండవు. "గొప్ప తెలివేగాని, పేగిరం గిన్నెలు తోవు!" అని లోపలికి వచ్చేసింది.

ఆ సాయంత్రం చక్కగా ముస్తాబయి కామేశ్వరరావు దగ్గకోసం ఎదురు చూస్తూ కూర్చుంది భానుమతి.

అతను రాలేదు.

అద్దంలో తన రూపం తనవైపు జాలిగా చూసింది.

ఏ రాత్రికో తండ్రి వచ్చేడు, "అతనొచ్చేడా, అమ్మలూ?" అంటూ.

సమాధానం భాను ముఖమే చెప్పింది. జాలితో కరిగిపోయేడు రఘురామయ్య, కూతురు పొందిన ఆశాభంగాన్ని గ్రహించుకుని.

## 3

రోజులు చాలా గడిచేయి.

ఓ సాయంకాలం ఒంటరిగా మాతిగట్టు మీద కూర్చుని ఉంది భానుమతి. ఆకాశ మధ్యాన పందిరిలా అలుముకుని ఉంది ఓ నల్ల మబ్బు— భాను హృదయాకాశంలోని నిరాశవంటిది. సూర్యుని బంగారు కాంతి (ఛైనా దండెత్తినా ఆ కాంతి వన్నె తగ్గలేదు) అల్లరి చేస్తూ తిరిగే పిట్టల రెక్కల అడుగు భాగాలను తాకి కితకితలు పెడుతున్నది. మబ్బు మంగళస్నానం చేస్తున్న యువతిలా ఉంది ఆ కాంతిలో.

"ఎవరండీ లోపల?"

చప్పున లేచి వీథివైపు వెళ్ళింది భానుమతి.

"రఘురామయ్య గారిల్లిదేనాండీ?" అని అడుగుతున్నది గేటు దగ్గర ఓ యువతి.

"అవునండీ" అంటూ గేటు తెరిచింది భాను.

"మీరేనా భానుమతిగారు?"

"అవునండీ. లోపలికి రండి" అంటూ ఆవిణ్ణి తీసుకువచ్చి గదిలో కుర్చీమీద కూర్చోబెట్టింది.

ఆ యువతికి కన్నె వన్నెలుగాని, పునిస్త్రీ చిన్నెలుగాని ఏమీ లేవు. వితంతువని ఊహించింది భాను.

"నేను కామేశ్వరరావుగారి స్నేహితురాల్ని." తన పేరు ముఖ్యం కాదన్నట్టు పరిచయం చేసుకుంది.

కుతూహలం పట్ట శక్యం కాకుండా ఉంది భానుకు. అయినా అదుపులో పెట్టుకుంటూ "అలాగా? ఎక్కడుంటున్నారాయన?" అంది.

"పోస్టాఫీసు దగ్గర. కూర్చోండి. నిలబడే ఉన్నారేమిటి? మా ఇల్లూ అక్కడే."

ఆవిణ్ణి చూస్తూంటే భానుకు ఎందుకో అంత మంచి అభిప్రాయం ఏర్పడటంలేదు. ఆమె మొహంలో అందం అంత కనబడదు. కాని ఆ శరీరనిర్మాణం చూస్తూంటే స్త్రీ అంటే అలాగే ఉండాలేమో అనిపిస్తోంది. నల్ల సిల్కు చీర, తెల్ల సిల్కు జాకెట్టు ఆమె అవయవాల ఒంపులనుబట్టి నెలుగు నీడలను పంచుకుని మెరుస్తున్నాయి. సంసార బాధ్యతలు లేకపోవడంవల్ల ఆమె వంగని పొగను ఆడవాళ్ళను వెక్కిరించగలదు; మగవాళ్ళను కవ్వించగలదు.

భాను భావాలను పసికట్టినట్టుంది ఆ యువతి. తను వచ్చిన పనిలోకి దిగింది. "అ. మాడండి. కామేశ్వరరావుగారికి కొన్ని రోజుల బట్టి ఒంట్లో ఏమీ బాగులేదు. వండుకు తినడం. ఆయన రూమ్‌మేట్సుకూడా [illegible] ఇంకో చోటు చూసుకున్నారు."

# సంక్రాంతి కాంత

### పరిగి రాధాకృష్ణ

మంచు పొరల ముసుగు వెనుక
మంచి మనసు దాచుకొని
మంచి మనసు నూరడించు
అంచనాలు వేసుకొని

వచ్చావా సంక్రాంతీ!
వచ్చావే ఓ ఇంతీ!
అందాలా భరిణవులే
అలరించే తరుణివిలే

హిమకణాల హారం మెడ
లో ధరించి వచ్చావా!
ప్రమదలనే ధిక్కరించ
పయనమ్మయి వచ్చావా!

నాలో నైరాశ్యమ్మును
కరగింపగ వచ్చావా!
ఆశల ఇంద్రధనుస్సులు
వెలిగింపగ వచ్చావా!

కాలం నాపై చల్లని
చూపులు ప్రసరించిందే,
తన చేలాంచలమున నా
కనుల నీరు తుడిచిందే.

అలలు అలలుగా తలపులు
నాలో కదలాడాయే.
రూపమె లేవట్టి కలలు
కళలు దిద్దుకొన్నాయే.
చలిచేసే చిలిపితనం
చూసి పళ్ళుకొరికానే.
కాని నీ కౌగిలిలో
దాని ఊసె మరచానే.

తుళుక్కుపడింది భాను. "ఇప్పు డెలా ఉంది ఆయనకి?" అంది ఆదుర్దాగా.

"అలాగే ఉందనుకోండి......"

"నే నొస్తానుండండి."

"రండి. నే నొచ్చినపనికూడా అదే."

భాను పరిగెట్టివెళ్ళి మొహానికి సబ్బు కడిగి, వీళ్ళతో తుడిచేసి, వక్షంమీద జానెడు వెడల్పం చులు చక్కగా నిలిచేలా వంగపండు రంగు చీర తొడుక్కుని, నీలం జాకెట్టు కట్టుకొని (ఏం భాషా దారిద్ర్యం? ప్చ్!) గదిలో వాలింది. తండ్రికూడా ఆ యువతితో మాట్లాడు తున్నాడు.

తెలుగు కాలండర్ ఓమాటు చూసి "పద. వేసూ వస్తాను" అన్నాడు.

ఇంటికి తాళంవేసి ముగ్గురూ బయలు దేరేరు. రిక్షా పిలుద్దామనుకుంటున్నాడింకా రఘురామయ్య. పరేంగితావగాహి రిక్షావాలా పరిగెట్టిరాబోయేడు. అంతలో నెంబరు 13 వాలి గద్దలా వాళ్ళు ముగ్గురినీ తన్నుకు పోయింది.

భానుమతికి ఆ రిక్షావాడిపై జాలి కలిగింది. ఏం లాభం? అది ఈజీఛెయిర్ జాలి. అంటే మనం సంతోషంతో పొంగిపోతున్నప్పుడు ఇతరులమీద పడేదన్నమాట.

సంతోషమా! అవును. మనసిచ్చినవాడికి జబ్బు చెయ్యడం అంటే మగువకొక గొప్ప అవకాశం కదూ మరి?

స్టాపుల పేర్లూ, ఊలలూ, ఎక్కేవాళ్ళూ, దిగే వాళ్ళూ— అంతా అక్కడక్కడే అన్నట్టు జరిగిపోతున్నాయి. సిటీ బస్సు ప్రయాణం భానుకెప్పుడూ సరదాగానే ఉంటుంది. చిన్న పిల్లల రైలులాటను గుర్తుకు తెస్తుంది.

బస్సు దిగి నాలుగడుగులువేసి ఆ యువతి వెంట ఓ సందులోకి నడిచేరు.

"ముక్కు జాగర్త!" అని నవ్విందావిడ.

అది సందా, భూతల నరకంగాని! పాదాలే జాగ్రత్తగా వేస్తారా? ముక్కేమూసుకుంటారా? ముసిరే దోమలూ ఈగలకే భయపడతారా? అక్కడే రోడ్డుతో సమంగా ఉన్న ఎదురెదురు గుమ్మాల్లో కూర్చుని ఉన్న జీవులు మనుష్యవర్గా నికి చెందిన ఆడజాతి అని గుర్తించ గలుగు తారా?

ఒక ఇంటిలోకి దారితీసింది ఆ ముందావిడ. గర్భగుడిలాటి చిన్న నడవ రోగిష్టి మానవ కీటకం ఉన్న మంచాన్ని కడుపులో దాచుకుంది. ముందుకు వెళ్ళేరు. మిట్ట మధ్యాహ్నం సూర్యుడు తొంగి చూసి భయపడి పారిపోవ డానికి ఎడమిచ్చేంత వాకిలి. ఎదురుగా వంట వసారా, ఇటుపక్క మేడమెట్లూ. మెట్ల కింది నుంచి సగం కనిపిస్తూ సైకిలుచక్రం అంత మయ్యి. వంటశాలలో ఆడవాళ్ళు పెనంమీద మాసె రాస్తున్నారు. భానుమతిని నీతి జాతిలేని స్త్రీవైపు చూసినట్టు చూసేరు. కలుక్కు మంది భాను హృదయం. జనంతో కిక్కిరిసిన రథం ఎక్కుతున్నట్టు ఆ ఇరుకు మెట్లు

## ఆశయాలా— అనుబంధాలా

ఎక్కుతున్నారు ముగ్గురూ. తల గోడకు ఢీ కొనగానే మెట్లు మలుపు తిరిగేయని గుర్తించి జాగ్రత్త పడింది.

మేడమీది గది తలుపుతోసి పక్కకు తప్పు కుని దారి ఇచ్చిందాయువతి.

వీళ్ళను చూడగానే గదిమధ్య నిలువుకు పడిచిన జంబుకానామీద పడుకున్న కామేశ్వ రావు ఉత్సాహంగా లేచి కూర్చుంటూ, "అరెరె! వీరిని తీసుకొచ్చేసేరా, రమణా! పోన్లెండి. నాకూ చూడాలనే ఉంది. రండి. ఇలా కూర్చోండి" అని తను లేచి ఆ జంబుకానా చూపించేడు.

గది ఫర్వాలేదు.

కూర్చుంటూ పైకి రఘురామయ్యా, మన స్సులో భానుమతీ నిట్టూర్చేరు.

"ఆలా వెళ్ళి పళ్ళు తెస్తానండి" అంటూ తలుపుదగ్గర రమణ తల వెనక్కు తగ్గింది.

గ్లూకోజు బిస్కట్లు తీసి ఆ తండ్రీ కూతుళ్ళముందు పెట్టేడు, "ఇంతకన్న ఏ ముంటుందీ పేదవాడి కుటీరంలో?" అంటూ కామేశ్వరరావు.

మరొకప్పుడయితే దాన్ని హాస్యంగా తీసుకునే వారేకాని, ఇప్పుడా మాట ఎంతో బాధ కలిగిం చింది వారికి.

"అదేం, అలా కూర్చున్నారు? నా జ్వరం సంగతి అడగనే లేదు మీరు!" అని బుంగమూతి పెట్టి నవ్వించేడు కామేశ్వరరావు. "ఓహో! ఇలాటిచోట సజీవుడనై ఉన్నందుకే ఆశ్చర్య పడుతున్నారా?" నవ్వుతూ అన్నాడు తిరిగి.

అతని నవ్వు భానుమతిని నొప్పించింది.

"ఏమిటోయి కామేశ్వరరావు, ఈ గదీ, నీ వరసాను?" అసగలిగేడు తండ్రి.

"ఈ గదికేవండీ? గాలీ, వెలుగూ బాగానే వస్తున్నాయిగదా" అంటూ కిటికీ దగ్గరకు వెళ్ళేడు కామేశ్వరరావు. "చూడండి. దూరంగా ఉన్న ఆ క్రేన్స్ ఎంత బరువునైనా ఎత్తడమే మా

> ### అర్పణ
>
> శ్రీమతి పి. రామలక్ష్మి రచించిన నవల 'అర్పణ' ప్రచురణ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 1965 ఫిబ్రవరి 3 వ తేదీ సంచికలో ప్రారంభం అవుతుందని తెలియపరచడానికి ఆనందిస్తున్నాము.
>
> ఎడిటర్.

పని అని చెబుతున్నాయి. ఎటు చూసినా ఇళ్ళు! కిటికీలలోంచి పెరళ్ళలోనూ, డాబాల మీదా కావలసినంత జీవితం కనిపిస్తుంది—"

నిరాశగా నవ్వి అన్నాడు రఘురామయ్య: "కాని నీ జీవితంమట్టుకు నీకు కనిపించదు."

అదేమీ వినిపించుకోలేదు కామేశ్వరరావు. "అదుగో, కొండమీద దీపాలు వెలిగేయి. ఇలా మేడ మీంచి రాత్రిపూట చూస్తే విశాఖ అందంగావే కనబడుతుంది."

"నాయనా! విశాఖ నీ దృష్టిలో ఎలా కనబడు తూందో అడగడానికి రాలేదు" అన్నాడు రఘు రామయ్య వాత్సల్యం నిండిన కోపంతో.

కామేశ్వరరావు నవ్వేడు. "విశాఖ కడుపులో ఎలా గడుపుకుంటున్నానో అని అడగడానికి వచ్చేరు. అవునా?"

"ఆయనగారికన్నీ వేళాకోళంగానే ఉంటాయి. మనం పోదాంపద, నాన్నా" అంది భాను ఒక్క పిసరు కదలకుండా.

"ముందు ఇతన్ని ఇందులోంచి పైకి నడి పించందే కదులుతావుటమ్మా? ఇవాళ మంచి కూడా."

"అయితే చాలా పెద్ద ఎత్తుతోనే బయలు దేరేరన్నమాట!"

"అనుమానం మనుషుల కన్నీ అలాటి ఊహలే. మేం ఏవీ ఎత్తులతో బయలు దేరలేదు."

"మా ఇంట్లో నీకు నచ్చిన గది తీసుకుని నీ మానాన్న నువ్వుండువుగాని."

"మా అన్నం మీరేం తినక్కర్లేదు—"

"అలా చెప్పు! వండుకు తిను; మాను. నీ పూను ఎత్తం" అని పెద్ద నిర్మొహమాట స్తుడిలా మొహం పెట్టేడు రఘురామయ్య.

"తిన్నారా, పస్తున్నారా? అనడగము." పెద్ద ఆరిందాలా అంది భాను.

ఈ వరసచూసి వేళాకోళం ధోరణి వదిలేసేడు కామేశ్వరరావు. "అది కాదు. నాకు రూం దొరికి సుఖంగా ఉన్నాక కూడా మిమ్మల్ని శ్రమపెట్టడం ఎందుకని......" అని మృదువుగా నచ్చజెప్ప బోయేడు.

"నా మాట వింటావా లేదా చెప్పు" అని సూటిగా ఘాటుగా అడిగేసేడు రఘురామయ్య.

"మధ్యలో కాళీచేసిపోతే ఇంటివారు...."

"ఇంటివారికేవయినా పుస్తెకట్టేవుటోయి! రా, నావెంట."

భాను మొహంతిప్పి నవ్వుకుంటూ అంది: "అలాగే అవుపడుతూంది!"

కామేశ్వరరావు కాస్త నవ్వుకోడానికి ఇవతలికి వచ్చేసేడు. కింద ఇంటివారితో ఏమేమో మాట్లాడుతున్నాడు.

"అద్దె సంగతిలా ఉంది" అంది భాను.

జేబులోనుంచి పదిరూపాయలనోట్లు తీసేడు రఘురామయ్య. కామేశ్వరరావు పైకి వచ్చేడు. లెక్క ఇస్తూ, "ఇంటద్దె ఇచ్చి" అన్నాడు రఘురామయ్య.

"పీరివ్వద్దు!"

"నేను దీన్ని నీకు ఉట్టినే ఇవ్వడంలేదు. నోటు రాయించుకుని, పది పైసల రెవిన్యూ బిళ్ళ అంటించి, దానిమీద నీ సంతకం చేయించుకుని.....ఆఁ. వెళ్ళు!" అన్నాడు రఘురామయ్య.

కోపంతో ఆయన నోట మాట పెగలక పోవడం గమనించి నవ్వుకున్నాడు కామేశ్వరరావు.

అతని వెనకాల ఇంటివారి పాప వచ్చి గుమ్మాన్ని పట్టుకుని నించుంది.

పౌడరు డబ్బీ తీసి అమెకిస్తూ 'మళ్ళీ వస్తాను, పాపా, ఇక్కడికి" అని బుజ్జగించేడు కామేశ్వరరావు.

'ఎంత మెత్తని మనసు!' అన్నట్టు జాలిగా తండ్రివైపు చూసింది భాను.

"వాళ్ళ నాన్నే!" అన్నాడు రఘురామయ్య కళ్ళనీళ్ళు తరవాయిగా.

సామాను సర్దుతూ ఉంటే పళ్ళతో రమణ వచ్చింది. "మాకు దూరంగా వెళ్ళిపోతున్నారన్న మాట" అంది.

"స్నేహితులమధ్య దూరం ఏమిటి? ఎక్కడున్నా మిమ్మల్ని కలవకుండా ఉండగలనా?"

భాను అయిష్టంగా మొహం తిప్పుకుంది.

"మీరు మంచి గదిలో కావలసినవారి మధ్య సుఖంగా ఉండడమే నాక్కావలసింది" అంది రమణ, మాటలు గొంతులో చిక్కుపడిపోతూండగా. "ఈవిడ నాకు గొప్ప సాయం చేసేరండీ" అంటూ రఘురామయ్య, భానుల దృష్టి తనవైపు తిప్పుకుని రమణగురించి చెప్పసాగేడు కామేశ్వరరావు.

"వేగిరం సరండి" అని హెచ్చరించింది రమణ, భాను చిన్నబుచ్చుకుని ఉండడం చూసి.

ఇంటివారి కుక్కపిల్ల — తెల్లగా నల్లటి మచ్చలతో ముచ్చటగా ఉన్నది— వచ్చింది. తోకాడిస్తూ, చుట్టూ తిరుగుతూ, ముందు కాళ్ళు ఎత్తుతూ కామేశ్వరరావు చెంబ్య నాకడం మొదలెట్టింది. పొట్లంతీసి మిగిలిన బిస్కట్లూ, గుండా దానిముందు పోసి మెడదువ్వేడు కామేశ్వరరావు.

సామాన్లు సర్దగానే తండ్రీ కూతుళ్ళిద్దరూ దిగిపోయేరు.

సందుచివర రిక్షా నిలబెట్టించి రిక్షావాణ్ణి పంపేడు రఘురామయ్య.

సామాను వచ్చింది కాని, కామేశ్వరరావు రాలేదు.

రమణ అంది: "ఉండండి మరి. ఆఇంటిల్లిపాదిదగ్గరా సెలవు తీసుకొని వాళ్ళందరికీ ఏవో చిన్న చిన్న కానుకలిచ్చి రావద్దూ?"

స్నేహంలోకూడా ఈర్ష్య బైర్పోడక్తే. మనకో మంచి స్నేహితుడున్నాడనుకోండి. అతను మనతో మాటాడినంత నిండుగా మరికొంత మందితో మాట్లాడడం సహించలేము.

బత్తాయిపళ్ళు పట్టుకుని వచ్చేడతను.

"తీసుకోండి" అన్నాడు రమణకు ఇస్తూ.

"నాకు పళ్ళెందుకు? దుక్కలా ఉన్నాను!"

"చిక్కకుండా ఉండడానికే. ప్లీజ్! నాకోసం" అంటూ బతిమాలసాగేడు.

"బావుంది భాగోతం, నడిరోడ్డుమీద" అంటూ దాన్ని కొనసాగించడం ఇష్టంలేక మాత్రమే పళ్ళు తీసుకుంది రమణ.

"మిమ్మల్ని చాలాసేపు నిలబెట్టేను" అని ఆ తండ్రీ కూతుళ్ళతో పలికి రిక్షా ఎక్కేడు కామేశ్వరరావు.

'నిండు మనసుతో అందరినీ ప్రేమించగల గుండె, మనసుల లోతులకు చూడగల ఎక్స్—రే చూపు, ఓర్పు—ఇవి అతను పొందిన వరాలు' అనుకుంటూ వెనక మరో రిక్షా ఎక్కింది భానుమతి.

(సశేషం)



నవభారత నిర్మాత నెహ్రూ

చిత్రం—ఎమ్ కృష్ణస్వామి (హైదరాబాదు-2)

# ఆశయాలూ అనుబంధాలూ

రుద్రాభట్ల నరసింగరావు

**జరిగిన కథ**

ట్రెయినింగ్ సీటుకు దరఖాస్తుదారు తన ప్రాణమిత్రుని కొడుకని తెలుసుకొన్నాడు రఘురామయ్య. కామేశ్వరరావు నిర్లిప్తత ఆయనను క్రుంగదీసింది. అదే భానును ఆకర్షించింది. కామేశ్వరరావు జబ్బుగా ఉన్నాడని తెలిసి చూడడానికి వెళ్ళారు తండ్రీ కూతుళ్ళు.

(క్రిందటి సంచిక తరువాయి)

## 4

పెరటివైపు గదిలో కామేశ్వర్రావు బస చక్కగా ఉంది. పూలమొక్కలనూ, నీలాకాశాన్నీ చూపే అందమైన పటాల్లాంటి రెండు కిటికీలు ఉన్నాయి గదికి. చల్లనిగాలి, మెత్తని కాంతి ఆ గది సొత్తులు. 'పారడైజ్ రీ గెయిన్డ్'లా ఉంది కామేశ్వర్రావుకు.

కొంచెం కాలు వచ్చి తోవ తెలియని పిల్లడిని తన పనులమధ్య పరిగెట్టి చూసుకుంటూ ఉంటుంది తల్లి. అలాగే భాను, కామేశ్వర్రావు రాకపోకలను గమనిస్తున్నది.

అప్పుడప్పుడు వండుకుంటున్నాడు కామేశ్వర్రావు. అదే ఆశ్చర్యంగా ఉంది భానుమతికి. గది మూల ఉన్న ఏ నారింజ డిప్పలో కరుణ రసంతో నిండివున్నై ఆమెను కదిపేవి.

"ఏవిటీ ఉపోష్యాలు?" అంది ఓ నాడు ఇక భరించలేక.

"ఆరోగ్యంకోసం" అన్నాడు కామేశ్వర్రావు.

"ఆరోగ్యంకోసం తిండి మానిడవా? ఎంత బావుందండీ!" అని చెక్కిట చెయ్యిచేర్చి చెక్కిన బొమ్మలా నిలబడిపోయేది భాను.

అధరువులు పట్టుకువచ్చేది. పుచ్చుకుంటాడు; పుచ్చుకోడు. దేవుడు భక్తుణ్ణి ఇంతకన్న వేగిరం అనుగ్రహిస్తాడు.

రాత్రి తెల్లవార్లూ మేలుకుని అతను ఎప్పుడు వస్తాడో తలుపు తియ్యాలని కూర్చుంటుంది. అతనా రాత్రి ఏ స్నేహితుడి గదిలోనో, రైల్వే స్టేషన్లోనో గడిపివస్తాడు.

నీళ్ళు తోడుతుంది. "వెయిటింగ్ రూంలో స్నానం చేశాను" అంటాడు.

కుంపటి అంటించి సాయపడబోతుంది. "నేను ఇవాళ అన్నం తినను" అంటాడు. "పళ్ళు తెచ్చేను. మీ రోపాటి తీసుకోండి" అని అందిస్తాడు పైగా. మృదువుగా బలవంతం చేస్తాడు.

అతని ఈ రకమైన సహాయనిరాకరణాన్ని రాను రాను భాను భరించలేకపోతున్నది. అహంభావం, బెట్టు లేవు. నిజంగానే సదుపాయం అంటే ఇష్టం లేదతనికి. అది గ్రహించే భాను అతని చర్యలకు దుఃఖపడిందే కాని, విసుక్కోలేదు.

రఘురామయ్యగారు కూడా బతిమాలుతారు. మళ్ళీ అతన్ని విసిగిస్తున్నామేమో అని భయపడి ఊరుకుంటారు.

గదికి తాళం వేసుకోడు కామేశ్వర్రావు.

తన ఒంటరి మధ్యాహ్నాలను అతని గదిలో గడపకుండా ఉండలేకపోయింది భాను.

అబ్బబ్బ! ఏం గది అది? ఎక్కడి పుస్తకాలక్కడే! ఎక్కడి కాగితాలక్కడే. పక్క దగ్గరే మెతుకులు! జంబుకానాను పీట చేసుకున్నాడు కాబోలు. తలవైపు ఎత్తుగా గట్టిగా ఉంటే 'ఇదేవిటి? సప్పికట్లుని తలగడా చేసుకోలేదు గద ఈ మనిషి!' అనుకుని తీసిచూస్తే అది కాగితాల కట్ట. పత్రికల కత్తిరింపులూ, సొంత రచనలూ, బొమ్మలూ అవీ ఉన్నాయి.

ఆ గది ఓ కావ్యం అనిపించింది భానుకు. అందులోని ప్రతి వస్తువూ నాయకుడి గురించి ఏదో కొంత గానం చేస్తున్నది.

సూట్‌కేసుమీద, గులాబీ రంగు కాగితాలను నీలం కాలికోతో బైండుచేసిన అందమైన పుస్తకం ఒకటి కనిపించింది. చప్పున దాన్ని తెరిచింది భాను. ఆకుపచ్చని పంక్తులు—సంజె వెలుగులో తమలపు తీగలను స్ఫురింపజేస్తూ.

మొదటి కాగితంమీద 'ఒక రచయిత నోట్ పుస్తకం (ఒకరకంగా డైరీ)' అని ఉంది.

మూసింది.

రచనలనూ, బొమ్మలనూ, ఇతర సామగ్రినీ చూడసాగింది. ధ్యానం అంతా ఆ నోట్‌బుక్ మీదికే మళ్ళుతున్నట్టు గ్రహించి గది బయటకు వచ్చేసింది.

పువ్వులు కోద్దామని పెరట్లోకి వెళ్ళింది, సాయంత్రం కాని జాజులు విడవు అని మరిచిన జవరాలు. ఎన్ని గులాబీలు పూసినప్పటికీ మొక్కన ఒకటి మిగిల్చి మిగతావి కోసుకోవడం భాను అలవాటు. ఆ గోలెం దగరకు వచ్చి ఏదో చెప్పుకోబోయింది.

నీలాకాశం — బైండునూ, గులాబీ—కాగితాలనూ, ఆకులు—అతని వ్రాతనూ కళ్ళముందుకు తేగా కొమ్మ వదిలేసింది. కొమ్మనున్న పువ్వు తొణికింది. కొమ్మ మొహంలో నవ్వు విచ్చుకుంది.

నెమ్మదిగా అతని గదివైపు నడిచింది భాను.

డైరీలూ, ఉత్తరాలూ చదవకూడదు. నిజమే. కాని—

1. ఇతని విషయంలో చదవకపోవడమే తప్పు కావచ్చు. కామేశ్వర్రావు వింత మనిషి. తన బాధలు చెప్పుకోడు. ఇది చదివి వాస్తవ పరిస్థితులు తెలుసుకుంటే తాము ఏ విధంగానైనా అతనికి సాయపడవచ్చును గదా!

2. పెళ్ళి అంటే అతనికి ఇష్టం లేకపోవడానికి ఏదైనా భగ్నప్రేమ కారణం కావచ్చు. నిజానికి దానితో తనకు సంబంధం లేదనుకో. కాని ఒక మనిషి గురించి పూర్తిగా తెలుసుకోగోరడం తప్పు కాదు.

3. ఈ పుస్తకం చదివితే అతన్ని రచయితగా మరింత అర్థం చేసుకోవచ్చు. తనకూ కొద్దో గొప్పో సాహిత్యాభిరుచి ఉంది మరి.

4. ఇంతా చేసి అది 'ఒక రచయిత నోట్ పుస్తకం.' అంటే ఎప్పుడో ఒకప్పుడు (సాధారణంగా రచయిత మరణానంతరం) అందరూ చదవడానికే.

5. తను కొంచెం ముందుగా వ్రాత ప్రతినే చదువుతున్నది. అంతే.

ఈ పంచసీలలనూ బిగించగానే ఆమె మనోయంత్రం చురుకుగా పనిచేసి సంశయాలను గుండ చేసింది.

అతని గదిలోకి వచ్చింది. ఆ నీలి పుస్తకాన్ని చేతిలోకి తీసుకోగానే భానుకు గగుర్పాటు కలిగింది.

గబుక్కున చివరి వ్రాత చూస్తుంది. అది చదివి అంతలోనే మొదటికి వచ్చేస్తుంది. ఈలోపున ఎన్నిటిమీదనో ఆమె చూపు నిలుస్తుంది. ఒక్కొక్కప్పుడు చదువుతున్న విషయంలోనే కొన్ని పదాలను దాటుతుంది. మరొకప్పుడు ఆమె చూడదలుచుకోని ముక్కలు ఆమె చూపులో పడతాయి.


అక్కడక్కడ కొన్ని వాక్యాలు చదివి ఆమె ఆలోచనలో పడిపోతూ ఉంటుంది. వాటిలో భావగాంభీర్యం, అవి తనకు వర్తిస్తాయేమో అని భుజాలు తడుముకోవడం కారణాలు.

పై సంగతులన్నిటికీ ఉదాహరణలు ఈ దిగువ కొల్లలుగా కనిపిస్తాయి. ఎందుచేతంటే ఇక్కడ ఇచ్చినది పూర్తి పుస్తకం కాదు. ఆ నోట్ పుస్తకంలో కథానాయిక దృష్టిలో పడిన భాగాలు మాత్రమే. (భాను ఆలోచనలో పడిన సందర్భాలను చుక్కలతోనూ, దాట్లను డాష్‌లతోనూ సూచిస్తాను.)

## 5

—పైడిరాజుగారి 'ఏటి కెదురు' మంచి చిత్రం —వర్ణనబాల —వాయులీనం లొంగిపోయిందాయనకు —

విశాఖపట్నం. ఏమి ఊరిది? ఇక్కడ పరుగులే గాని, ఇంకో రకం జీవితం ఉన్నట్టు కనపడదు. సైరన్ కూతలు, సిటీ బస్సుల రణగుణ ధ్వనులు, కొంచెం బాగున్న చోటును పాడు చేసేదాకా తోచని ప్రజలు. సముద్రం ఆ కంపును భరించలేకనే విరిగి వెనక్కు పడుతున్నదా అనిపిస్తుంది. సముద్రంలో నిలబడ్డ బోడికొండ







# ఆశయాలూ - అనుబంధాలూ

ఒకటి.

స్కూలు యువతులకు యూనిఫారం ఏం బాగులేదు. భిన్నత్వంలో రంగు రంగుల సీతాకోక చిలుకలులా ఉండవలసినదల్లా పోయి—

కాని నా బాధలో ఈ ఊరింత అసహ్యంగా కనిపిస్తున్నదేమో? నిన్నటినుంచీ తిండీ, నీళ్ళూ లేవు. అప్లికేషన్ ఇద్దామని ఆఫీసుకు వెళ్ళితే అధికారి కాంపులో ఉన్నారు, పొమ్మన్నాడు గుమాస్తా. బతిమాలితే గెటవుట్ అన్నాడు, నా దైన్యం ఇచ్చిన ధైర్యంతో.

బాగా మెక్కిన విలాస యాత్రికులకు విశాఖ అందంగానే కనపడవచ్చు. కొట్లలో అద్దాల వెనక అందంగా అమర్చిన వస్తువులు, కొమ్ము, దంతపు సామానులు, కొండమీద దీపాలు, చీకట్లో తెల్లగా మెరిసే సముద్రపు కెరటాల నురుగు, కొండమీద తిరుగుతూఉండే దీపపు టిల్లుతాలూకు కాంతిపుంజము. (తెలుగు రచయిత ఇంగ్లీషు పదాలను వాడడం ఆ రచయిత ప్రాథమికదశ దాటలేదని సూచిస్తుందని ఇటీవల ఒక విమర్శక జోరీగ.)

—ఇన్‌స్పెక్టర్‌గారమ్మాయి అరుదైన అందం. బిగువైన వయస్సు. అమాయకంగా కనిపించే పల్చని పెదవుంతో, చిన్ననోరు మెరిసే కళ్ళు ఎంతో అనుభవాన్ని ప్రదర్శిస్తాయి. వాటిలో బాధితులపై గొప్ప జాలి కనపడుతుంది......

ఆకలీ, ఎండా, టిక్కెట్టు లేని ప్రయాణమూ—వీటితో కుంగిపోయిఉన్న నన్ను చొరవగా పలకరించి వేళాకోళం ఆడింది. పాయసం ఇచ్చి పన్నీరు చల్లినట్లయింది. ఆమె కాయింటిలో ఉన్న స్వేచ్ఛనుబట్టి చూస్తే తల్లిలేని పిల్లలా ఉంది. పాపం—

—నెహ్రూ. ఎంత బహుముఖ వ్యక్తిత్వం—

—మనం ప్రేమించేవారికి మరణం ఉందని గుర్తించము. ఈ ప్రేమ ఎక్కువవుతున్నకొద్దీ మరణం ఉనికిని గుర్తించకపోవడం కూడా ఎక్కువవుతుంది. అందరికన్నా మిన్నగా తన్ను తాను ప్రేమించుకుంటాడు మనిషి. అందుకే అందరిలోనూ తన చావు గురించి మాత్రమే ఆలోచించడు. కాని ఎంతో సాహచర్యం ఉన్న ఆత్మీయులు పోయినప్పుడు మృత్యువు అదృశ్యంగా మననూ హెచ్చరిస్తూ ఉంటుంది.

నాన్న పోయేరు.

ఓ మనిషి పోవడం, లేదా ఓ కుర్రాడికి తండ్రి పోవడం చాలా స్వల్పమైనదీ, సహజమైనదీ అనిపిస్తుంది లోకానికి. కాని ఆ మంచిమనసు నివసించిన దేహం ఒకప్పుడు నన్ను ఒళ్ళో కూర్చోబెట్టుకుంది. నాకేవో తినిపించి పులకరించింది. నా చిన్న చిన్న విజయాలను విని ఆనందాశ్రువులు రాల్చింది. నా బాధలను పోగొట్టడానికి అలసి, నా సౌఖ్యంలో గుర్పాటు పొందింది.

తీసుకుపోయి తగలబెట్టడానికి బ్రాహ్మలకు తొందరేగాని, ఆ దేహంతో నాకు ఎన్ని ఎసోసియేషన్సు ఉన్నాయో ఎవరికి తెలుసు?

ఎలా వ్రాసుకుని ఏడవను? నాన్న చచ్చిపోయేరంటే నమ్మలేకుండా ఉన్నాను. మొన్న ఆమధ్య ఓ మాటు పట్నంవెళ్ళినప్పుడు అలవాటు చొప్పున నాన్న కిష్టమైన పామేడ్, టూత్ పౌడరు కొందామని షాపులోకి అడుగుపెట్టేను కూడా. సిరాబుడ్డి కొనుక్కుని బరువైన గుండెతో బయటికి వచ్చేను.

(నెహ్రూ ఇలాటి ఉదంతమే ఆత్మకథలో—భావుకులందరి బాధలూ ఒకలాటివే)—

—ఒక్కొక్కప్పుడు నా ఈ కోపతాపాలకు ఏమయినా అర్థం ఉందా; నాకేమీ అధికారం లేనివాళ్ళమీద ఇంత మండిపడుతున్న నేను క్షమార్హుణ్ణేనా అనిపిస్తుంది.

అప్పటికే పెడర్థాలులాగి విపరీతంగా కోపం తెచ్చుకుంటున్నాను.

నాన్న తన జీవితంలోని చివరి దశాబ్దం అంకితం చేసిన స్కూలు మాస్టర్లు వచ్చారు. తెలుగు పండితుడూ, మరో ముగ్గురూ కలిసి చొక్కాలు విప్పి నడుములు బిగించేరు.

శ్రమదానం! ధనదానం!

వాళ్ళ మొహాలలో సంతృప్తి చూసి అసహ్యం వేసింది.

ఓ మూల శవం కాలుతుంటే ఆ చచ్చిపోయినాయన బట్టలు తమలో ఎవరికి చెందవలసిందీ తేల్చుకోడానికి తెలుగు పండితుడి దగ్గర చేరి తగూపడుతున్నారు ఇద్దరు చాకలాళ్ళు (గ్రేవ్ డిగ్గర్స్ ఇన్ హామ్లెట్).

"ఇంకో బండి కర్రలకు పంపిస్తేగాని లాభం లేదు" అంటున్నారు లక్ష్మీపతిరాజు డ్రిల్లు మేస్టరు. లాభంట లాభం, గూబ బద్దలు కొట్టేవాడులేక.

"మీనన్న దించీసేరుట. మీరు విన్నారా?" తనను ఎత్తేసినంత ఉత్సాహంతో నరసింహం.

"విద్యామంత్రి మారేడు గనక మన జీతాల స్కేళ్ళేమయినా...." అని వాన్నేడు భగవాన్లు. బహుకుటుంబికుడు. కనకుండా ఉండడం చేతగాకపోతే, పుట్టగానే పిల్లల పీక పిసికేస్తే పీడ వదిలేదికదా!

ఒళ్ళు మండింది. నాన్నది కాదు, నాది!

బోడిగుండ్లతో, చేతగుండు చెంబులతో మేము అన్నదమ్ములం తిరిగి రాగానే మమ్మల్ని చూస్తూనే, "అప్పుడే మీ నాన్న ఋణం తీర్చేసేరా, నాయనా?" అంటూ రాళ్ళు కరిగేలా ఏడ్చింది అమ్మ. కాని నా గుండె రాయైనా కాదేమో. రవ్వంత సానుభూతి కలగలేదు ఆమెమీద. 'పిల్లలకు నిరవాకం ఏమీ చెయ్యలేదని రోగంతో ఉన్న నాన్నను సాధించిన అమ్మేనా ఈమె?' అనిపించింది పైగా.

అమ్మమ్మ అంది: "మీ ఇంటినిండా దాసదాసీల్ని

చూసి పొంగిపోయి మీ మామ్మను బతిమాలి చేసేను - ఈ సమ్మంధం. కూర్చుని తింటే కొండంత ఆస్తయినా ఆగదు. మీ నౌకర్ను మేడలు కట్టేరు. మీరిలా ఊరుకాని ఊళ్ళో పడి ఉన్నారు. ఆఖరుకు మిమ్మల్ని తిండికి లేనివాళ్ళని చేసి పోయేడు మహరాజు.''

అమ్మమ్మను తిట్టేను. అవి తిట్లుకావు, శాపాలు.

మావయ్యవచ్చేడు. ''ట్రెయినింగు చదవడం కంటె చేసేదేముంది?'' అన్నాడు— పడరాని మాటలు నాచేత పడడానికే.

జీవితం పోగొట్టుకున్నారు నాన్న. తండ్రి పోయి కష్టంలో ఉన్నాను నేను. దీన్ని ఎవ్వరూ గుర్తించినట్టే లేదెంచేత?

అసలు నా తండ్రి ఎందుకు చనిపోవలసి వచ్చింది అని లోకాన్నే ప్రశ్నిస్తున్న వైఖరి ఏర్పడింది నాలో.

ఇలాటి వింత మనస్తత్వాన్ని విశ్లేషిస్తూ నాలాటి కథానాయకుడితో ఓ కథ వ్రాయడానికైతే బాగానే ఉంటుంది. అతనిలోని భావుకత్వాన్నీ, అమాయకత్వాన్నీ గుర్తించి వాటి దృష్ట్యా అతని నేరాలను అర్థం చేసుకొని జాలిపడి క్షమించి ప్రేమించి దువ్వగల కథానాయిక ఉంటే కథ ఇంకా రక్తి కడుతుంది. ..... కాని జీవితం కథ కాదు. ఆత్మీయుణ్ణి పోగొట్టుకున్న దుఃఖంలో ఆప్తులను దూరం చేసుకోకూడదు.

—వెన్న బలే ఇష్టం నాకు. అది: 'వృష్యం బల్యమతి స్నిగ్ధం మధురం గ్రాహిశీతలమ్'.

—నాన్న బూడిదయిపోతూంటే అంత విర్లిప్తంగా ఉండగలిగిన శేషగిరి వైపు ప్రశ్నార్థకంగా చూస్తూ ఉండిపోయేను. అది కనిపెట్టే అన్నాడుగదా తమ్ముడు: ''విచారించవలసిన పని లేదన్నయ్యా. బూడిద అవుతున్నది నాన్న కాదు— ఆయన దీర్ఘరోగం, పదేళ్ళ బెంగ.''

ఇవి తమ్ముడి మనస్తత్వానికి తగిఉన్న మాటలు. విధిగా జరిగే దుర్ఘటనలను తేలికగా తీసుకుంటూ, ఇంకా వాటినుంచే ఒక రకమైన ఊరట కూడా పొందుతాడు తమ్ముడు.

ఇందుకు పూర్తిగా భిన్నం నేను. నా కలల్లో నేనుండి, కాంతిలోకాల్లో విహరిస్తూ ఈ జీవితంలో నీడలున్నాయనే సత్యాన్నే గుర్తించలేదు నేను. అందుకే ఈ తొలినీడ నా జీవితంపై పరుచుకోగానే, ఆ నీడ పడింగని నమ్మలేకా, అలా పడడం అతి మామూలు విషయం అన్నట్టు చూసే ఈ లోకం వైఖరి భరించలేకా తల్లకిందులయిపోయేను.

నామీద నాకు జాలి పెరిగిపోయింది ( సెల్ఫ్—పిటీ ). నేరస్తుణ్ణి అన్న భావం ఒక పక్క పుండుమీద ఈగలా గెలుకుతున్నది ( గిల్టీ కాన్షన్స్ ). నాన్నను దక్కించుకోలేక పోవటమే నా నేరం.

ఇలా నేరం చేశాననే బాధతో కుళ్ళుతున్నందువల్లే సామాన్య విషయాలపట్ల శ్రద్ధ తీసుకోవడం మానేసేను. భోజనం, పడక వంటి శారీరకావసరాలను వదులుతున్నాను. లేదా అవస్థాం చుకుంటూ పొందుతున్నాను.

కోరి ఎండలో తిరుగుతున్నాను. సోడా అయినా తాగను. నాకు వచ్చిన కష్టానికి ఇతరులు ఎలాగా సానుభూతి చూపడంలేదు. అయితే నా ప్రస్తుత స్థితి చూసి జాలిపడతారని నా ఆశ.

గుండుకు ఓ తుండయినా చుట్టుకోక బయల్దేరడం అందుకే.

ఇలాటి ఆత్మానుభవంతో, నిరంతరం తాను ఏదో పాపం చేస్తున్నాననే భ్రమలో పశ్చాత్తాప పడుతూండే పాత్రతో ఓ కథ......

• • •

నవ్వు వచ్చింది భానుమతికి. సాహిత్యంకోసం జీవితం అన్నట్టుంది ఈయన వరస.

ఆ దరహాస చంద్రికలో అతనిపై అధికం అవుతున్న జాలి నీహారమై కురిసింది.

కళ్ళు నిండేయని గ్రహించుకుని సిగ్గుప ఇటూ అటూ చూసి కళ్ళొత్తుకుని తిరిగి చదవ ప్రారంభించింది.

## 6

—పప్పు: శీతము లఘువు ( ట ) భావమిశ్రుడి జీర్ణశక్తికి కాబోలు.

—బుద్ధికి మంచివి: తీపి దానిమ్మ, సరస్వతీ ఆకు, కరివేపాకు ( పచ్చడి ఎంతరుచియైనది! ) పులగము—

—తమ్ముణ్ణి నాయకుడుగాచేసి నవల వ్రాద్దామనిపిస్తూంటుంది ఒక్కొక్కప్పుడు. కాని నా దృక్కోణం నుంచి చూస్తే తమ్ముడికి నాయక లక్షణాలు బహుతక్కువ. అయితేనేం? జీవితంలో హీరోస్ ఎక్కడనుంచి వస్తారు? కథల్లోనేగాని, గోర్కీ కథల్లో హీరోస్ లేరనీ, వాళ్ళంతా సామాన్యమానవులనీ కొందరి అభిప్రాయం. కాని అతని కథల్లోనూ ఉన్నారు వాళ్ళు... వాళ్ళంతా జీవిత సమస్యలతో పోరాడిన వీరులు, హీరోలు. శేషగిరి అలాటి హీరో!

నాన్న మంచాన పడిననాటినుంచీ కుటుంబానికి తిండి దొరికేదారి లేకపోయింది. జీవితంలోని ఉత్తమ భాగాన్ని చాకిరీలో గడపనందుకు శిక్షగా ఉద్యోగ విరమణానంతరం కానీ పొందని నాన్నకు దిగులే రోగం అనుకుంటే రోగంకూడా వచ్చి మా అందరి దిగులునూ పెంచింది. అప్పుడు మొదలెట్టేడు తమ్ముడు ట్యూషన్లు; కాదు, నడకలు, అరుపులు. మైళ్ళకొద్దీ నడిచి ఆ పిల్లలను కని పడేసిన వాళ్ళ ఇళ్ళకు పోయి చెప్పేవాడు.

నేను పానయి ఆరేళ్ళయినా నేటిదాకా కుర్చీ గుడ్డలు చింపడమే పనిగాపెట్టుకున్నాను. చదువు, వ్రాత, గీతలు ఇవి నా లోకం.

ఎప్పుడైనా ఓ కథ తాలూకు మనిఆర్డరు వస్తే పళ్ళు, గ్లూకోజు కొని నాన్న పక్కన ఉంచేవాణ్ణి. అంతే.

''నువ్వు నాకోసం పుట్టేవురా, తండ్రీ'' అనేవారు తడి కళ్ళతో మండే కడుపుతో.

''కాదు, మిమ్మల్ని చంపుకోడానికి పుట్టేను'' అని ఆక్రోశించేవాణ్ణి చాటుగా.

ఉద్యోగ ప్రయత్నాలు చేసేను. ఇల్లు అంటుకున్నాక నుయ్యి తియ్యడం మొదలెట్టేను. నుయ్యి తీస్తున్నా నన్నమాటే గాని, సౌందర్యం కోసం ఆరాటం మాని దీక్షగా పని చేసేనా? లేదు.

అందాలు కావాలి. పైపైకి ఎగరాలి. నిజమే. నీ హృదయం పిట్టే. కాని నీకున్న అవకాశాల రెక్కలు? బాతురెక్కలు ( ఎగరడానికి పనికి రావు ).

లభించిన పరిస్థితుల్లో ఇమడలేరు; కావలసిన ... వస్తువులకోసం వాళ్ళు ...



హేమంత ప్రాతఃకాల సమావేశం ఫోటో—ఆర్. కె. పార్థసారథి (మద్రాసు-2)

ఉచితము ! ఉచితము !!

**తెల్లమచ్చలు**

మా ప్రఖ్యాతివహించిన **'దాగ్‌సాఫ్'** ప్రత్యేక ఔషధము తెల్లమచ్చలను సులభముగ పోగొట్టుటలో 1925 సం॥ నుండి ప్రఖ్యాతి వహించియున్నది. మూడురోజులు వాడినంతనే మచ్చలను తెలుపుదనం,కొన్ని రోజులలోనమూలంగానాశనము చేయుగల శక్తి కలిగిఉన్నది. ఉచితంగా ఒకపాకెట్ మందుయివ్వబడును.నకలునుచూచిమోస పోకండి.

**NATH PHARMACY,**
**P.O. Katrisarai (Gaya)**

**నారసింహా లేహ్యం**

అత్యుష్ణము, బలహీనతల హరించి ధాతువృద్ధి, బలము కల్గించును. డబ్బి రు. 3—50

**రోజాపుష్ప లేహ్యం**

మలబద్ధము పోగొట్టి సాఫీ విరేచనము, జీర్ణశక్తి కల్గించును. 1 డబ్బి రు. 1—25

**సర్విట (మకరధ్వజతో)**

నరములు బలహీనత పోగొట్టి రక్తవృద్ధి, ధాతుశక్తి కల్గించును. 1 సీసా రు. 6—75

పెద్ద క్యాట్లాగు ఉచితము.

**వి.శి.ప. & కో, పెరిదేపి, నెల్లూరుజిల్లా.**

**గృహములో వాడదగు సినిమా ప్రొజెక్టరుకు ఆర్డరు యివ్వండి**

**AMERICAN MODEL AUTOMATIC MOVIE HOME CINEMA**




మీ అభిమాన ఫిలిం తారలను రొమాన్సులోను. హాస్య, అద్భుత, భయానక, సాహస సన్నివేశాలలోను, పార్టీలను, కార్టూన్లను, పండిట్ నెహ్రూ కథను తెరమీద సకుటుంబ బంధు మిత్రసమేతంగా మీ స్వగృహంలోనే దర్శించండి. బొమ్మలు సినిమాహాలులోలాగనే వివిధ రంగులలో సజీవంగాకదులుతూ,హాస్యంచేస్తూ కనిపించగలవు ఎ/సి లేక డి/సి విద్యుచ్ఛక్తితో గాని టార్చి లైటు రిలేగాని ఆపరేట్ చేయబడును సాధారణ వెల రు. 15 —లు 10 అ. ఫిలిం 2'×3' తెర ఫ్రీ స్పెక్టకిల్సు ఉచితం. పోస్టేజి రు 4—50 పైన ఉత్తమ రకం—మిక్కిలి ఎక్కువగా అమ్మబడుచున్న డీలక్సు స్పెషల్ ప్రొజెక్టర్ వెల రు. 25 — పూర్తి సెట్టు. 60 అ. ఫిలిం, 4'×3' తెర ఫ్రీ స్పెక్టకిల్సు,ఫిలిం గజం1 ॥ 25 పై పోస్టేజిడు 5/-సి ఆర్డరు నకే చేయండి

**HOLLYWOOD CINEMA CORP. (Regd.**
**2194 Kalyanpura. DELHI-6**

# ఆశయాలూ - అనుబంధాలూ

గింజుకుపోతున్నారు.

ఒక అసంతృప్తి రచయితకు ఉండవలసినదే అన్నది వేరే సంగతి.

తమ్ముడు తనకు కావలసిన పరిస్థితులను కల్పించుకోవడానికి పోరాడతాడు.

చాకలి లేడు. ఉతికి, చెంబులో నిప్పులుపోసి ఇస్త్రీ చేసి నలగని బట్టకడతాడు. బట్ట నలిగిపోయినా ఫర్వాలేదంటాను గాని, ఇస్త్రీ అంత శ్రమ పడను నేను. (ఈ అత్యవసర పరిస్థితిలో దేశం శేషగిరులను కోరుతున్నది; కామేశ్వరరావులను కాదు.)

నాన్న పోయిన తర్వాత "ఇప్పు డాయనకీ, మనకీ సుఖం" అన్నాడు శేషగిరి.

"అలా అనుకోగానే పోతుందిరా, తండ్రీ? ఏదీ నీ మనస్సుని అలా సమాధాన పెట్టుకో, చూద్దాం" అని అమ్మ అంటుంది.

"ఇంకా అంతకి దిగజారలేదు."

కొడుకు గొంతులోనే చిక్కుపడిపోయిన ఏడుపునూ, కళ్ళలోనే ఆగిపోయిన నీళ్ళనూ కనిపెట్టి ఏడ్చేసింది అమ్మ.

నా బాధను ఇతరులపై రుద్ది, రాక్షసుణ్ణయే నాతో పోల్చుకుంటే శేషగిరి హీరోయిక్‌గానే కనిపించేడు.

పాఠకుడికి కూడా అత నలా కనిపించాలంటే నాలాటి పాత్రను ప్రవేశపెట్టి ఆ నలువు పక్క శేషగిరిని చిత్రిస్తే కొట్టవచ్చినట్టు అతని గుణాలు—.....

* * * *

ఇటీవల నా కథలు ఒకటే మూసలో పోసి తీసినట్టుగా ఉంటున్నాయనీ, ఎటొచ్చీ ఆ మూస ఎరువు తెచ్చుకున్నది కాకపోవడమే సంతోషించ దగినదనీ మిత్రులు కొందరు (ధ. రా. ఎస్., సి. రా.) అంటున్నారు.

వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకుని ప్రేమించే నాయికలను సృష్టిస్తున్నాను. అవీ నా నేరం.

ఇంతవరకూ ఉన్న ప్రేమ సూత్రా లివిట:

1. తొలి చూపు→కుసుమాస్త్రతూపు→ ప్రేమ ఊపు (ప్రాచీన ప్రణయ సూత్రం).

నవలాథర్సు సిద్ధాంతాలు :

2. (అమ్మాయి + అబ్బాయి) కలహం$^2$= వేరు రూట్ అఫ్ ప్రేమ.

3. సహవిద్య→సహం విద్య + సహం ప్రేమ యొక్క సిద్ధాంతము, మరియు ఆచరణ.

4. శకటాలు→ప్రయాణీకుల కోసం అని కొందరు ✕ ప్రణయజీవుల కోసం అని కథకులు.

ఇవన్నీ పైత్యాథర్సు సిద్ధాంతాలని నా నమ్మకం. లేదా అవి నిజమే కావచ్చు.

స్వవిషయం: కళ అవ్యక్త వాంఛలకు రూపం అన్న మాట నిజమే అయితే, నాది ఇంతో, అంతో కళే అయితే, నాలోని అవ్యక్త వాంఛ:

'నా వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకుని దాని కోసమే నన్ను ప్రేమించగల యువతి తటస్థపడితే బాగుణ్ణు' అనేది కావాలి....

* * *

చప్పున పుస్తకం మూసి యథాస్థానంలో ఉంచి ఇవతలికి వచ్చేసింది భానుమతి. అతని హృదయం తలుపులు తెరవడానికి తగిన తాళపు చెవులు దొరికినట్టయింది ఈ ఆఖరి వాక్యాలు చదవగానే ఆమెకు. అంతేకాదు. బెల్టు తగిలించి మీట నొక్కగానే పనిచేసే యంత్రంలా ఆమె మెదడు ఈ వాక్యం చూడగానే విశ్రాంతి విహీనం అయింది.

ఇల్లు తుడవడం మొదలుపెట్టింది. సగంలోనే చీపురుకట్ట హాలుమధ్య పారేసి మొక్కలకు నీళ్ళు పోసింది. జాజులు కోసింది. దండ గుచ్చడం మానేసి రేడియోమీద పోసింది. రేడియో పెట్టింది. ప్రసారం ప్రారంభమయే ముందు వచ్చే ధ్వని వచ్చి చికాకు కలిగించింది.

మళ్ళీ కామేశ్వరరావు గది దగ్గరికి వెళ్ళింది.

ఎప్పుడు వచ్చేడో కామేశ్వరరావు గదిలో పడుకుని ఉన్నాడు.

"రండి లోపలికి. అదేం? అలా వింతగా అప్పుడే ఆవిష్కరించబడిన చిత్రపటంవైపు చూస్తున్నట్టు చూస్తారేం? ఏం కొత్తదనం వచ్చింది ఇవాళ నాలో?" అని నవ్వుతూ లేచి కూర్చున్నాడు కామేశ్వరరావు.

కొంచెం సిగ్గుపడి లోపలికి వెళ్ళి కూర్చుంది భానుమతి. తను అలా చూసినట్టు అతను చెప్పేదాకా తెలియలేదు.

"అబ్బ! మీరు సిగ్గుపడుతూంటే ఎంత అందంగా ఉంటారండీ! మీ పోర్ట్రెయిట్ వేస్తాను" అన్నాడు కామేశ్వరరావు ఒక్కసారి ఉత్సాహంగా.

సిగ్గు పడిపోయింది భాను.

అంతలో అనుమానం. తనను మోడలుగా ఉపయోగించుకో దలిచేడా ఆయన? చురుకుగా తల ఎత్తింది. అతని కళ్ళు తనపై స్నేహపు వెన్నెలను కురుస్తున్నాయి.

"తప్పకుండా వెయ్యాలి" అంది.

కాని ఆమె అనుమానాలను అప్పుడే కామేశ్వరరావు పసిగట్టేడు.

"నా ముఖ్యమైన స్నేహితుల పోర్ట్రెయిటులు వేసి వాళ్ళ వాళ్ళకు ప్రెజెంటు చేసుకోవాలనే కోరిక కలిగిందండీ ఈమధ్య" అన్నాడు.

భానుమతిలో ఈర్ష్య రేగింది.

"కాని నాకు మీలాటి ముఖ్యమైన స్నేహితులు వేళ్ళమీద లెక్కపెట్టగలిగినంతమంది మాత్రమే" అన్నాడు కామేశ్వరరావు భాను భావాలను చదువుతూ.

నవ్వు వచ్చింది భానుకు, తనెక్కడ నొచ్చుకుంటుందో అని భయపడిపోతున్న కామేశ్వరరావు అవస్థ చూసి.

**(సశేషం)**

# ఆశయాలూ - అనుబంధాలూ

రుద్రాభట్ల నరసింగరావు

## జరిగిన కథ

**డ్రైయివింగ్ సీటుకు దరఖాస్తుదారు తన ప్రాణమిత్రుని కొడుకని తెలుసుకొన్నాడు రఘురామయ్య. కామేశ్వరరావు విర్లిప్తత ఆయనను క్రుంగదీసింది. అదే భానును ఆకర్షించింది. కామేశ్వరరావు జబ్బుగా ఉన్నాడని తెలిసిచూడడానికి వెళ్ళి ఇంటికి తీసుకొని వచ్చారు తండ్రీ కూతుళ్ళు. కామేశ్వరరావు డైరీ చదివి అతని ఆంతర్యం గ్రహించింది భాను.**

(క్రిందటి సంచిక తరువాయి)

## 7

కామేశ్వరరావు మీదరఘురామయ్యకు రాను రాను మక్కువ ఎక్కువవుతున్నది. అతనితో మాట్లాడడం ఆయనకు ధూమపానంలాటి అలవాటయిపోయింది.

భానుకు కామేశ్వరరావు గదిలో గడపడం తత్వవేత్తకు ఆలోచించడంలాటి అలవాటయిపోయింది. కథలలో నాయికలలా అతని వస్తువు లేవీ సర్దదు. బిడియం.

ఆ పుస్తకం చూడడం మటుకు మానలేదు. స్త్రీకి కుతూహలం ఎక్కువ. కష్టాలను వ్యాప్తి చెయ్యడానికి ఒక పాండోరాయే కావలసి వచ్చింది. ఆ పుస్తకం చదవడం మొదలుపెట్టిన దగ్గర నుంచి భానుకు దిగులు ఎక్కువవుతూనే ఉంది.

కామేశ్వరరావు ఒక హిమాలయంలాగ కనిపించేడు. అనుభవాల వేడికి నిత్యం కరిగిపోతూ, క్రిందఉన్నవారి హృదయ మైదానాలలో ఆనందం పండిస్తూ, కష్టాల చలిగాలికి చలించక గడ్డకట్టి నిలిచే మనిషి; పిట్టంత మనిషి.

ఒక రోజు ఆ పుస్తకం తన గదిలోకి తెచ్చుకుంది. మంచంమీద ఓ కాలుజాపి, చీర కుచ్చెళ్ళు విసినికర్రలా విప్పుకోగా కింద ఓ కాలు ఆనించి పడుకుని చదవసాగింది.

ఆకలి గురించి ఎందుకు వ్రాయను? ఆకలి ఎరగక కాదు. ఉత్తమమైన విలువలతో కూడిన జీవితాన్ని చిత్రించాలని.

రమణ: జీవితంలో విషాదం, విచిత్రమైన మనస్తత్వం. ఆమెకు మగవాళ్ళపట్ల సుహృద్భావం లేదు. కాని ఎంతో మంచితో స్నేహం చేస్తుంది. అలా మగవాళ్ళతో [illegible] ద్వారా తనకు అన్యాయం చేసిన సంఘాన్ని [illegible] మని కసిగా ఉందనిపిస్తుంది ఆమెకు. కాని ఆమె హృదయం ఉన్నతమైనది. అందుకే మగవాళ్ళ నైచ్యంచూస్తే ఆమెకు రోత.

మొదట నా చిత్రకళ చూసి నాతో స్నేహం కట్టింది. తర్వాత నా గదీ, నా బతుకూ చూసి నా మీద ఆమెకు జాలికలిగింది. ఆమె నాకెన్నో విధాల సాయం చెయ్యబోయింది. కాని నాకు ఆ సాయాలు అవసరం లేదని గ్రహించుకోగానే ఉడికి పోయింది.

పక్కలో కూర్చుని బత్తాయి తొనలు ఒలిచి నోటికందించేది. వింతలేకుండా తినేవాణ్ణి. షికికి నడిపించుకుపోయేది. స్నేహితుడితో వెళ్ళినట్టే వెళ్ళేవాణ్ణి.

నా నిగ్రహంతో విసిగిపోయింది. మా తిరుగుళ్ళతో ఆ చుట్టుపట్ల వాళ్ళూ, ఇంటివారూ విసిగిపోయేరు. ఏ ఆడపిల్ల నా గదికి వచ్చినా ఆమెను అనుమానంగా అనాదరణతో చూడసాగేరు......

రమణ అంగసౌష్ఠవం గొప్పది. నగ్నంగా కూర్చుంటే ఆమెను చిత్రిస్తానన్నాను. ఎంతవే ఒప్పుకుందామె! రమణ ఆంతర్యం నాకు తెలుసు. నిగ్రహించుకున్నానా; శాశ్వతంగా ఒక మంచి మిత్రుడుగా అట్టే పెట్టుకుంటుంది నన్ను. లేదా ప్రియుడుగా పొంద గలుగుతుంది. ఉభయత్రా ఆమెకు లాభమే.

మూడురోజుల ముందునుంచీ ఉపోష్యం ఉండి ఆ క్షణానికి తయారయేను. నా శరీరం నా సంస్కారాన్ని ఎక్కడ మింగుతుందో అని భయం.

జయించేను. నగ్న సౌందర్యాన్ని ఏ వికారం లేకుండా చిత్రించ గలిగేను......

ఉధృతంగా కెరటాలు వస్తున్నవేళ "సముద్రం తెరిచ్చినాది" అంటారు పల్లెవాళ్ళు.

కొండపోడి: కొండల్లో భూమిని సాగు చెయ్యడానికి ముందు తుప్పలనూ, వాటినీ నరికి మంట పెడతారు—

'ఏరోస్మిత్' సింక్లెయిర్ లూయీ—

పేజీలు గబగబ తిప్పుతూ ఆ రమణ గురించి ఇంకెక్కడయినా వ్రాశాడేమో అని చూసింది భాను. నిరాశ ఎదురయింది.

ఆ దృశ్యాన్ని తలుచుకుని ఆమె హృదయం ఝల్లుమంటున్నది. రమణ! ఎంత సిగ్గుమాలినది!

తన పేరు కనపడగానే ఆగి చదివింది.

భానుమతి: మంచి ఆలోచనగల అమ్మాయి. తక్కువ మాట్లాడింది; తక్కువ ఇవ్వబోయింది. కాని నా బాగుకోసం ఎక్కువ వ్యథ పడుతున్నది ఆమే.

నాకు ఎందరో ఎన్నో ఇవ్వబోయేవారు. థాంక్స్ చెప్పి వాళ్ళ సాయాలను నేను వద్దనగానే వాళ్ళు చికాకుపడేవారు. కోపంతో ఎంతో మంది స్నేహితులే వదిలేశారు నన్ను. అంటే వాళ్ళకు ఇవ్వడంలో కాక ఇవ్వగలమని చాటుకోవడంలో సంతోషం దొరుకుతుందన్న మాట. వాళ్ళకది దక్కనిచ్చేను కాదనే నామీద కోపం. కాని భానుమతికి కోపం రాలేదు. ఎందుకు వస్తుంది? ఆమెకు నా మీద గొప్ప జాలి ఉంది.

ఇతరులలోని మంచిని మాత్రం పైకి తీసి చూసి ఆనందించాలని నా ఆశ. ఇవ్వడంలోనే కాని పుచ్చుకోవడంలో ఆనందం లేదు.

కాని భానుమతిపట్ల నా ప్రవర్తన మార్చుకోవాలి. ఏమి ఇచ్చి ఆమెను సంతోషపెట్టలేను. కాబట్టి ఆమెదగ్గర తీసుకోవాలి . . . .

భానుమతిని చూసిన తర్వాత ఈ ఊహ—

ఆడపిల్ల వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోదు. మగాడు అర్థం చేసుకోవడానికి ఆడపిల్లకు ఓ వ్యక్తిత్వం అంటూ ఉండదు. భానుమతిని చూసిన తర్వాత ఈ ఊహ మార్చుకోవా లనిపిస్తున్నది...

పోర్ట్రెయిట్ వేస్తున్నాను. రంగు లేవి? పేపరేది?

. ఇంకా చదివేదే గాని, ఏదో చెయ్యాలనే తొందరలో పుస్తకం మూసి అతని గదిలో పెట్టి వచ్చింది.

సూదులూ, దారాలూ ఉన్న రేకుపెట్టె తెరిచింది. అడుగున ఒకదానిలో ఒకటి మడతపెట్టి దాచుకున్న నోట్లు తీసి, కాఫీ పెట్టి ఫ్లాస్కులో పోసి తండ్రి బల్లమీద ఉంచి టాయిలెట్ పూర్తి చేసుకుంది.

తండ్రి రాగానే "నాన్నా, కాఫీ అక్కడ బల్లమీద పెట్టేను. ఓ మాటు అలా బజారు కెళ్ళి రానా?" అన్న ప్రశ్నతోనే వెళ్ళుతున్నానని చెప్పి బయలుదేరింది.

## 8

"అరెరె! ఇవన్నీ మీరు కొని పట్టుకొచ్చిసేరేవిటి?"

"ఎవరైతేనేం?" అన్న ఒక్క ముక్కలో తేనె ఒలికించింది భాను.

"చాలా మంచివండీ ఈ ట్యూబులు." రంగు [illegible] అన్నాడు కామేశ్వరావు.

పొంగిపోయింది భాను.

దేవు డిచ్చిన రోజు.

ఉదయమే కామేశ్వరరావు గదిదగ్గరికి వెళ్ళింది భాను. తలుపు తోసింది.

ఒక్క కట్ డ్రాయరుతో తల్లకిందులుగా ఉన్నాడు కామేశ్వరరావు. సిగ్గువేసింది.

అలికిడి విని కాబోలు, తొందరగా దిగ బోయేడు. అతని పాదాలు ఆమె బుజాలకు బలంగా తగిలేయి, పావురాలపై ఇటుకలు పడ్డట్లు.

"అయ్యయ్యో! నొప్పెట్టేయా బుజాలు?" అన్నాడు నిలబడి తువ్వాలు చుట్టుకుంటూ.

అంత నొప్పెట్టలేదు గాని, ఒంట్లోంచి విద్యుత్తు ప్రవహించినట్లయింది అని భాను అన లేదు; అనుకోనూ లేదు. జరిగిన దిది:

రెప్పలు బరువుగా దిగిపోగా మునివేళ్ళతో అధరాన్ని అదిమిపట్టి తల ఓ వైపు వాల్చి అజంతా సుందరిలా నిలబడిపోయింది.

ఆ సౌందర్యం చెదిరిపోతుందేమో అని బెదురు తున్నట్టు మెల్లిగా "భానుమతీ" అన్నాడు.

తెప్పరిల్లి నవ్వు వెలిగించింది భాను.

"పోర్ట్రెయిట్ మొదలెడతారా?"

కామేశ్వరరావు కిటికీలోనుంచి చూశాడు. లేయెండ చెట్లమీది మంచు బిందువులకు కిత కితలు పెడుతున్నది.

"వెలుగు స్థిరంగా ఉండాలి. ఇంకో గంటలో కూర్చుందాము."

"ఓ!"

"ఈలోపున మీరూ పనులు చక్కబెట్టుకుని సిద్ధంగా ఉండండి."

"పెద్ద పనులేమీ లేవు. కూర లేం రాలేదు పెరట్లోకి. కరేపాకు పచ్చడి చేశాను. మీ కిష్ట మేనా?"

"ఓ! తెండి."

"ఓ!" అంటూ నవ్వుతూవెళ్ళింది.

ఎన్నడూ లేనిది ఇవాళ కామేశ్వరరావు చూపులు తనను తడుముతున్నట్లు అనిపించింది.

ఎంత బి. ఒ. లు బుర్రలో తిరుగుతున్నా, కూతురి నవోత్సాహాన్ని కనిపెట్టేడు రఘు రామయ్య.

"ఏమిటమ్మలూ, సంగతి?"

"కామేశ్వరరావుగారు నా పోర్ట్రెయిట్ వేస్తానన్నారు, నాన్నా."

"ఇంకేం? మంచి కాలక్షేపం మీ కివాళ. అవగ నేనూ చూస్తాను."

పర్మిను ఎక్కువౌతున్నకొద్దీ రఘురామయ్యకు సెలవు రోజులు కూడా ఆఫీసులో గడపనిదే తోచదు.

ఆయన వెళ్ళిన తర్వాత భోజనంచేసి వంటిల్లు చక్కబెట్టుకుని చిత్రానికి తయారయింది భాను. వరులు జడ. బిగుతు రవిక. పాదాలపై జీరాడుతూ నిండుగా కుచ్చెళ్ళు వచ్చే చీర.

కామేశ్వరరావు కోసం దానిమ్మ గింజలు ఒలిచి సాసర్లో ఉంచుతున్నది. హాల్లో అతను కుర్చీలు సర్దడం వినిపించింది.

సాసరు తీసుకుని హాల్లోకి నడిచింది. ఒక కుర్చీమీద దాన్ని ఉంచింది.

అతను భయపడుతున్నట్టు ముఖంపెట్టి సాసరువైపూ, ఆమెవైపూ మార్చి మార్చి చూడ సాగేడు.

"అదేమిటే, అలా భయపడిపోతున్నారు? దానిమ్మ గింజలండీ."

"అమ్మయ్య! మీ పళ్ళుగాని సాసర్లోకి వచ్చిసేయేమో అని. . . . ."

"పాత ఉపమానమే!" అని నవ్వింది భాను.

"ఇలా కూర్చోండి" అని ఓ కుర్చీ చూపిం చేడు. భాను కూర్చుంది.

డ్రాయింగు బోర్డుమీద కాగితాన్ని ఒక బల్ల మీద ( ఈజెల్ లేక ) నిలబెట్టుకున్నాడు. పక్కన ఇంకో బల్లమీద పింగాణీ ప్లేటు, రంగులు, కుంచెలు, గాజు గ్లాసుతో నీళ్ళు ఉన్నాయి.

ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ భానుమతిని చూసేడు. "ఊహుఁ! దూరం చాలదు. లేవండి" అంటూ ఆమె లేవగానే కుర్చీని మరో చోట వేసేడు. మళ్ళీ పరీక్షిం చేడు. మళ్ళీ మార్చేడు. ఆఖరికి ఆమెను కూర్చోనిచ్చేడు.

"ఎలా ఉన్నాయి గుండెలు? ఆహా! మీ చెక్కిళ్ళమీద చిరుచెమటలు ముత్యాల్లా...."

"అయ్యో, నా మీద కవిత్వం చెప్పడానికి పిలవలేదు గదా, నన్ను?"

"ఇహ సరిగా పని కానిద్దాము. ఎడమ చెయ్యి వక్షం దిగువ, కుడిచెయ్యి ఇలా, చూపుడువేలు బుగ్గపై, బొటనవేలు గడ్డంకింద ఇలా—" అంటూ ఆ భంగిమ తాను పెట్టి చూపేడు కామేశ్వరరావు.

భానుమతి అతను చెప్పినట్లు కూర్చుంది.

"ఆఁ! అదీ" అంటూ స్కెచ్ గీస్తూనే చెప్పుకుపోతున్నాడు కామేశ్వరరావు: "చిత్రకళకు వ్యుత్పత్తి అడగండి, తెలుగు నిఘంటు కర్తను. చిత్రమైన సంగతులు గలది అంటాడేమో! సామా న్యుల మాట అలా ఉండగా, పెద్ద విమర్శకులు అనిపించుకున్నవాళ్ళలోనే దీన్ని సరిగా అర్థం చేసుకునే ప్రయత్నం కనపడదు. ఓ సారి ఓ మంచి చిత్రకారుడు చిన్న తమాషా చేశాడుట! —అలా చూడండి."

భానుమతి అతను సూచించిన వైపు చూసింది. ఏమీ కనపడలేదు.

ఆ వాలుచూపు సౌందర్యం పట్టేసిన వెంటనే మళ్ళీ అందుకున్నాడు.

"ఆఁ! తమాషా చేశాడుట. ఓ గాడిదకి నోటిదగ్గర బాగా మేత పడేసేడు. తోకదగ్గర రంగుల పళ్ళెం, కాన్వాసు ఉంచేడు. మేత దొరికిన హుషారులో గాడిదకి తోకాడింపు ఎక్కువై పోయింది. తోకకి రంగులు అంటుకుంటున్నాయి. కాన్వాసుమీద చిందరవందరగా పడుతున్నాయి. కొంతసేపయేక అతను కాన్వాసు తీసి చక్కగా కత్తిరించి ఖండాంతర ఖ్యాతి నార్జించిన ఓ విమర్శకుడికి చూపేడుట. ఇహ చూసుకోండి. ఆ విమర్శకుడు అది యాబ్‌స్ట్రాక్టిజమ్‌లోనో, మరో ఇజమ్‌లోనో గీసిన గొప్ప చిత్రం అంటూ ఓ పెద్ద వ్యాసం కూడా వ్రాసి ప్రక టించేడుట.

"ఇంతా చేసి అది గాడి తోకిజం."

స్కెచ్ వెయ్యడం పూర్తయింది. "చాలా ఓపికగా కూర్చున్నారండీ" అంటూ రంగులు కలుపుకోసాగేడు.

"ముందా దానిమ్మ గింజలు...." స్వేచ్ఛగా కదిలి అంది.

"తింటాను. ఆఁ! మళ్ళీ మామూలుగా కూర్చోండి" అంటూ రంగులతో చిత్రిస్తూ ఓ చేత్తో దానిమ్మ గింజలు నోట్లో వేసుకో సాగేడు.



ఏసుక్రీస్తు

చిత్రం—అడబాల చెన్న కేశవరావు (భీమవరం)

"మీకు బొత్తిగా ఏకాగ్రత లేదండీ!"

"ఈ ఏకాగ్రత గురించి చాలా కథలున్నా యండీ. నేను ఆర్ట్సు స్కూల్లో గడిపిన రోజు ల్లో జరిగిన సంగతి: ప్రిన్సిపాలుగారు చిత్రం వేస్తున్నారు—మీరన్నారే ఆ ఏకాగ్రతతోటి. ఆయన భార్య కాఫీ తీసుకొచ్చి పక్కన పెట్టేరు. అడపా దడపా నీళ్ళలో ముంచవలసిన కుంచె కాస్తా కాఫీలో ముంచుతూ చిత్రాన్ని మట్టుకు పూర్తిచేశారు. ఆఖరున పక్కకి తిరిగి చూస్తే రంగుల మయమైన కాఫీ అవుపడింది. అలాటి ఏకాగ్రత నాకూ కుదిరితే దానిమ్మ గింజలబదులు ఈ ట్యూబుల మూతలు మింగేస్తానేమో అని భయం" అన్నాడు నవ్వుతూ.

రూప చిత్రకారుడు సిట్టర్‌ను ఉత్సాహ పరుస్తూంటాడు. అది తెలుసు భానుకు.

ఆవేళ అయినంత మట్టుకే చూసి ఆశ్చర్య

# ఆశయాలూ- అనుబంధాలూ

పోయింది.

"ఇంత బాగా వేస్తారే! మరి మీరు రచయిత ననే చెప్పుకుంటా రెంచేత?"

"నా కదే ఇష్టం. రచయిత అనగానే అన్నీ తెలిసినవాడై ఉండాలనీ, అలా ఉంటాడనీ అని పిస్తుంది. ఒట్టి హంగు. నాకంటే మొద్దబ్బాయి ఇంకోడు కనపడలేదు నాకు."

"దాని మాటెలా ఉన్నా మీ అంత దొంగ లింకెక్కడా ఉండరన్నది నిజం."

"నన్ను బంధించే పోలీసులు కూడా ఇక్కడే ఉన్నారన్నది కూడా నిజమేనా?"

ఆ ఏడు గజాల చీరనుమించి మెత్తగా ఆమెను చుట్టేసి కితకితలు పెట్టింది సిగ్గు.

## 9

ఆ మరునాడు కామేశ్వర్రావు, వీధిలోకి వెళ్ళిన వాడు, ఇంటికి రాలేదు.

భానుమతి అతని గదిలోకి వెళ్ళలేదు. అతను హాల్లో నిలిపిన తన రూపచిత్రం చూస్తూ కూర్చుండిపోయింది.

"ఇందులో నువ్వే కాదు, అమ్మలూ! ఆ చల్లని రంగుల సమ్మేళనంలో అతని నవనీత హృదయం కూడా తొంగి చూస్తోంది" అన్నాడు రఘురామయ్య.

చిత్రం! ఆ చిత్రం చూస్తుంటే భానులో పిరికితనమో, కొత్త సంస్కారమో మొలకెత్తుతున్నది. అందుకే అతని నోట్ పుస్తకం చూడ డానికి వెరుస్తున్నది.

మరువాడూ రాలేదతను. కొన్నాళ్ళయేక—

"ఇదేమిటమ్మా? ఇంట్లో ఉంటేనే తిండీ, పడకా మరిచిపోయే అర్భకుడు అవతల ఎలా బతుకుతున్నాడు? నువ్వేమయినా...."

"అబ్బెబ్బే, నే నేమీ ఎరగను, నాన్నా!" అని కొంత ఆలోచించి "అతని కాళీ సమయంలో మనం ఎక్కువగా మాట్లాడి అడ్డు తగులుతున్నా మని ఏమయినా బాధ పడ్డాడేమో" అంది.

తండ్రి దెబ్బతిన్నాడు. "అవునమ్మలూ! అస్తమానం అతని గదిలో చేరి విసిగిస్తున్నాను. అతని విశ్రాంతిని పాడుచెయ్యడానికి నాకేం అధికారం ఉంది? అని ఆలోచించలేదు" అన్నాడు బాధగా.

కూతురు మరీ బాధ పడి అంది: "అది కాదు, నాన్నా."

"లేదు. నిజమే అమ్మలూ, నువ్వన్నది. నావల్ల తప్పుండబట్టే......"

భాను కస్సుమంది. "ఏమిటి నిజం? తనలో నీ ప్రాణ స్నేహితుణ్ణే చూసుకుంటూ ఎంతో ఆపేక్షగా మాట్లాడవస్తే అది గ్రహించగల హృదయం లేనివాడాయనైతే మధ్య మనం బాధ పడడం ఎందుకు, నాన్నా?" అని గిరుక్కున తిరిగి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

రఘురామయ్యకు నవ్వు వచ్చింది.

భానును అనుసరించేడు. వంటింటి ద్వారం రెండు చేతులతో పట్టుకుని లోపలికి చూస్తూ, "ఇంతకీ అతను మనవల్ల ఏదో ఇబ్బందిపడి ఇంటికి రాలేదని ఎక్కడుం దమ్మలూ?" అన్నాడు చిరునవ్వుతో.

భాను వెనుదిరిగి తండ్రి ముఖం చూసింది. ఆమె చికాకు మాయమయింది.

"అవును సుమా! నాకు తట్టనేలేదు!"

కూతురువైపు వాత్సల్యంగా చూసి వెళ్ళిపోయేడు రఘురామయ్య.

హఠాత్తుగా నోట్ పుస్తకం చూడాలనే కోరిక మెరిసింది భాను మనసులో. ఏం చేసినా అతని బాగు కోరేగదా!

అతని గదిలో కాలుపెట్టింది. పుస్తకం తెరిచి ఉంది, వ్రాస్తూ వ్రాస్తూ వదిలిపెట్టినట్టు. దానిపక్కనే చింపిన కవరు ఒకటి ఉంది.

"ఇవాళ తమ్ముడు రాసిన ఉత్తరం హృదయాన్ని కుట్టినట్టయింది. కాని బాధను చెరిపేసుకున్నాను."

ఆత్రంగా చదువుతున్నది. అది అతను ఇంట్లో కనపడిన ఆఖరు రోజున వ్రాసుకున్నది:


1. "కుటుంబ సభ్యులపట్ల నాకు సానుభూతి (అసలు, కాకుంటే తనకున్నంత) లేదంటాడు శేషగిరి. అది నిజం కాదు. ఏకాంతంలో నావాళ్ళకోసం నేను కన్నీళ్ళు విడుస్తాను. నలుగురిలో నవ్వుతాను. సమస్యల గురించి బెంగెట్టుకుని జీవితాన్ని నాశనం చేసుకోవడం అంటే భయపడతాను. లేని విచారాన్ని నటించడం అన్నా, ఉన్నదాన్ని అందరి ఎదటా కనబరచడం అన్నా ఇష్టం ఉండదు నాకు.

2. డబ్బు పంపడం లేదంటాడు. నిజమే. చేతకావడంలేదు.

3. ఇంట్లో సరుకులు లేవు. 'మీరు అం వాట్లకు బానిసలు. అమ్మ కాఫీ మానలేదు; మీరంతా అన్నం మానలేరు' అని విసుక్కుంటావా? విసుక్కోవు. నాకు తెలుసు. కాని నీ జీవన విధానమే అందరినీ వెక్కిరిస్తున్నట్టు ఉంటుంది అని వ్రాసేడు తమ్ముడు. ఎంత

నరుగుడు డొంక

ఫోటో—జి. ప్రభాకరరావు (విశాఖపట్నం-2)



అహోహా! ఎంత బలహీనులు కానీ మనుష్యుల పట్ల నా కెంతో జాలీ, ప్రేమా ఉన్నాయి. తల్లికీ, తోడబుట్టినవాళ్ళకూ ఉపయోగపడలేక పోతున్నాననే వ్యథ ఒక పక్కా, ఇక్కడ ఆదరణ చూపేవారి మధ్య సుఖంగా గడిపివేస్తున్నాననే చింత మరోపక్కా నన్ను కుంగదీస్తున్నాయి.

దీనినుంచి బయటపడాలి, దానికి చెల్లించుకో వలసిన రుసుము ఏదైనా సరే.

భాను రూపచిత్రం వెయ్యడంలో నిన్న మంచి ఉత్సాహంగా గడిచింది. ఆమెను చూస్తుంటే అమ్మ జ్ఞాపకం వస్తున్నది. ('మోస్ట్ మెన్ మా[illegible] దెయిర్ మదర్స్'—ఏదో పత్రిక వ్యాసం.) ఆమె పెట్టినవి తింటున్నప్పుడు చూడాలి ఆమె కళ్ళలో తృప్తి......

గాలి వీచింది. కాగితాలు రెప రెప తిరిగేయి. అవి ఆగేసరికి 'సలహాలు' అన్న మాటమీద భాను చూపు నిలిచింది.

ఓ పాత స్నేహితుడు కలిసేడివాళ. నా జీవిత విధానం తన కేం నచ్చలేదుట. సలహాలు దంచి వేసేడు. నామీద అధికారం ఉన్నట్టు మందలించేడు.

చెడ్డ చికాకు కలిగింది.

ఇలాంటివాళ్ళ వాదన ఒక్కటే: 'నిన్ను ప్రేమిస్తున్నాము. నీ శ్రేయస్సు కోరుతున్నాము. నీమీద ఆపాట [illegible]ం ఉండదా మాకు?' అని.

ఉండదు!

నేను ప్రేమించేవాళ్ళకు మాత్రమే నామీద అధికారం ఉంటుంది.

వాళ్ళు మాత్రమే నాకు సలహా లివ్వగలరు. కాదు, శాసించగలరు. నా రహస్యాలు తెలుసుకునే అర్హత కూడా వాళ్ళకే ఉంటుంది.

చెంపమీద ఛెళ్ళున కొట్టినట్టయింది భానుకు. ఆ పుస్తకం అలాగే వదిలి పారిపోయి మంచంమీద వాలిపోయింది.

'చాలా క్రూరంగా శిక్షింపబడింది తను' అనుకుంది ఓసారి. తన కా శిక్ష చాలదనుకుంది మరోసారి. ఏడ్చింది.

రాత్రి భోజనాల దగ్గర కూతురు వాడిపోయిన ముఖం చూసేడు రఘురామయ్య.

"అతనే వస్తాడమ్మలూ. ఏదో స్నేహితులతో కాలక్షేపం చేస్తూ ఉండిఉంటాడు" అన్నాడు.

భాను మౌనంగా వడ్డిస్తున్నది.

"రేపు నేను కనుక్కుంటానులే, అమ్మలూ. అతన్ని తీసుకొచ్చే పూచీ నాది కదూ" అంటూ అన్నం కలుపుకోసాగేడు.

"ఆ పని మాత్రం చెయ్యకు, నాన్నా."

నోటి దగ్గర కడి కంచంలో పడింది. కూతురు మనసు ఆయన కేమీ అర్థం కావడంలేదు. ఎదిగిన పిల్ల.

అదే ఉంటే? అనే బాధ కదిలిం దాయనలో. సహించకపోయినా, తినకపోతే కూతురు మరింత బాధ పడుతుందని నాలుగు మెతుకులు తిని ఉత్తరాపోశనం పట్టేడు రఘురామయ్య.

(సశేషం)